ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

మంగళవారం 12 మార్చి 2024 | 5

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (మంగళ) సా.6.21
సహరి(బుధ) ఉ.4.53

ఓటుంటే..చీర! 7

టెన్షన్ పెట్టేస్తున్నారు!



బకాయి ఫీజు కడితేనే 'పది' హాల్ టిక్కెట్లు

- ప్రైవేటు పాఠశాలల్లో ఇదీ తీరు
- ఫీజులు చెల్లించాలని సందేశాలు
- లేకపోతే హాల్ టిక్కెట్లు ఇవ్వం
- నలిగిపోతున్న విద్యార్థులు
- తల్లిదండ్రుల ఉరుకులు.. పరుగులు
- జిల్లాలో 29,990 మంది విద్యార్థులు
- 18 నుంచే పదో తరగతి పరీక్షలు
- హాల్ టిక్కెట్లు ఆపితే ఊరుకోం
- అధికారుల హెచ్చరిక

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఓ ప్రైవేటు పాఠశాలలో ఓ విద్యార్థిని పదో తరగతి చదువుతోంది. హాల్ టికెట్ కోసం వెళ్లగా.. 'నువ్వు ఇంకా రూ.3500 ఫీజు కట్టాలి. మీ నాన్నను ఆ ఫీజు కట్టేసి హాల్ టికెట్ తీసుకెళ్లమను' అని కరాఖండిగా చెప్ప డంతో విద్యార్థి ఏడుస్తూ ఇంటికి వెళ్లిపోయింది. వెలుగులోకి రాని ఇలాంటి ఘటనలు జిల్లాలో జరుగుతున్నాయి. విద్యార్థుల జీవితానికి తొలిమెట్టు వంటి పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఇంకా వారం రోజులే సమ యం ఉంది. అయితే విద్యార్థులను కొన్ని ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాలు 'హాల్‌టికెట్‌కి ఫీజు బకాయి'కి లంకె పెట్టి ఆందోళనకు గురిచేస్తున్నారు.వాస్తవానికి హాల్ టికెట్‌ని కచ్చితంగా విద్యార్థికి అందజేయాలి. ఇతర వ్యవహారాలకు ముడిపెట్టి హాల్ టికెట్ ఇవ్వ కుండా ఉంటే నేరం చేసినట్లే.కానీ పరీక్షలే అదనుగా ఫీజులను బలవంతంగా రాబట్టుకొనేందుకు తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నారు. బకాయి చెల్లించకపోతే హాల్ టికెట్ ఇవ్వబోమంటూ విద్యార్థులను భయపెడుతున్నారు. దీంతో తల్లిదండ్రులు అప్పులకు పరుగులు పెడుతున్నారు.

ఇదా సమయం?

ప్రైవేటు స్కూల్స్ విద్యతో వ్యాపారం చేస్తుంటాయి. ఫీజులపైనే నిర్వహణ ఖర్చు, లాభాలు, వ్యాపార విస్తరణ ఆధారపడి ఉంటాయి. ఇవన్నీ తెలిసినా పిల్లల భవిష్యత్తు మెరుగ్గా ఉంటుందనే ఆశతో తల్లిదండ్రులు ప్రైవేటు వైపు మొగ్గు చూపుతారు. అయితే ఫీజుల బకాయిలు రాబట్టుకోడానికి వార్షిక పరీక్షలు సమయం కాదని, పిల్లలు మానసికంగా ఇబ్బంది పడితే ఆ ప్రభావం పరీక్షా ఫలితాలపై పడుతుందని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరీక్షలు దగ్గరకు వచ్చే సమయంలో ప్రైవేటు తీరు మరీ దారుణంగా తయారవుతోంది.పదోతరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేసి మరీ వేధిస్తున్నాయి. కార్పొరేట్/ సెంట్రల్/హెడ్ ఆఫీస్ నుంచి టీం వచ్చారు. ఫీజు తక్షణం కట్టకపోతే హాల్ టికెట్‌కి రావొద్దంటూ బెదిరిస్తున్నాయి. దీంతో తల్లిదండ్రులు తెలిసిన వారు, బంధువులకు ఫోన్లు చేసి అప్పు కోసం అర్థిస్తున్నారు. ఫీజు ఈ రోజు కట్టేస్తు న్నారా, నేను పరీక్ష రాస్తానా లేదా? అంటూ పిల్లలు కన్నీరు పెడుతుంటే ఆ తల్లిదండ్రుల మనోవేదన వర్ణనాతీతం.గతేడాది ఏప్రిల్ 3 నుంచి పది వార్షిక పరీక్షలు జరిగాయి. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పరీక్షలను 15 రోజులు ముందుకు జరిపారు. దీంతో మార్చి 18 నుంచే పరీ క్షలను నిర్వహిస్తున్నారు.

గతంలో పబ్లిక్ డొమైన్‌లో

విద్యార్థులకు ఇబ్బంది రాకూడదనే ఉద్దేశంతో గతంలో హాల్ టికెట్లను పబ్లిక్ డొమైన్‌లో పెట్టేవారు. అంటే విద్యార్థి నేరుగా హాల్ టికెట్‌ని ప్రింట్ తీసుకొని పరీక్షలకు హాజరుకావచ్చు. హాల్ టికెట్‌పై హెచ్‌ఎం /ప్రిన్సిపాల్ సంతకం కేవలం ఐచ్ఛికం (ఆప్షనల్) మాత్రమే. దీంతో విద్యార్థులకు ఊరడింపుగా, తల్లిదండ్రులకు ప్రశాంతంగా ఉండేది. కానీ ఈ ఏడాది పబ్లిక్ డొమైన్‌లో పెట్టడంపై ఇంకా సమాచారం లేదు. ప్రతి ఏడాదీ హాల్‌టికెట్‌కి ఫీజు బకాయిలకు లంకె పెడుతుండడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నా విద్యాశాఖ అధికారులు 'ఎందుకనో' ముందుగా ఎలాంటి ప్రకటనా విడుదల చేయడం లేదు. పబ్లిక్ డొమైన్‌లో హాల్ టికెట్లను ఉంచి అనుగుణంగా విద్యాశాఖ అధికారులు ప్రకటన వెలువరిస్తే విద్యార్థులకు చాలా మటుకు తిప్పలు తప్పే అవకాశం ఉంది. పైగా సందట్లో సడేమియా అనే మాదిరిగా ఫీజులను పూర్తిగా నగదు రూపంలో కట్టించుకుంటున్నా, ఆన్‌లైన్ విధానాన్ని పక్కన పెట్టేసినా, కోట్ల రూపాయల్లో నగదు లావాదేవీలు జరుగుతున్నా సంబంధిత శాఖలు కాలు మెదపకుండా బ్లాక్ మనీకి తమవంతు పరోక్షంగా సహకరిస్తున్నారనే అపవాదు ఉంది.

హాల్ టికెట్లు ఆపడానికి వీల్లేదు

కె.వాసుదేవరావు, డీఈవో



ఫీజులు బకాయిలు ఉన్నాయంటూ హాల్ టికెట్‌ని విద్యార్థికి జారీ చేయకుండా ఆపడానికి వీల్లేదు. ఇప్పటికే ప్రైవేటు/కార్పొరేటు పాఠశాలలకు ఈ విషయాన్ని స్పష్టంగా చెప్పాం. హాల్ టికెట్ ఇవ్వకపోవడం వల్ల విద్యార్థి పరీక్షకు హాజరుకాకపోతే ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు బాధ్యత వహించాల్సి వస్తుంది. హాల్ టికెట్ విషయంలో ఇబ్బందులు ఏర్పడితే విద్యార్థులు విద్యాశాఖ అధికారులను సంప్రదించాలని కోరుతున్నాం. విద్యార్థులు పరీక్షలు ప్రశాంత వాతావరణంలో రాయడానికి అన్ని ఏర్పాట్లూ చేస్తున్నాం. ఏ పాఠశాలలో అయినా ఫీజు కట్టాలని హాల్ టిక్కెట్ ఇవ్వకపోతే సమాచారం ఇవ్వండి.. వెంటనే చర్యలు తీసుకుంటాం.

జిల్లాలో 137 కేంద్రాల్లో

జిల్లాలోని ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యే పది పరీక్షలకు 19 మండలాల్లో 137 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 206 ప్రైవేటు ఉన్నత పాఠశాలలు, 194 ప్రభుత్వ పాఠశాలల్లో కలిపి 29,990 విద్యార్థులకు హాల్ టికెట్లు అందాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకూ ఎంతమందికి చేరాయో, ఇంకా తీసుకోని వారి ఇబ్బందులేమిటో అనే అంశాలపై పట్టింపు, పర్యవేక్షణ లేకపోవడంతో ప్రైవేటు పాఠశాలలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు వినవస్తున్నాయి. దీంతో విద్యార్థులు నలిగిపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 30 వేల మంది విద్యార్థులుంటే వీరిలో 70 శాతం ప్రైవేటు విద్యార్థులే.తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించాలనే కోరికతో ఫీజులు కట్టలేకపోయినా ప్రైవేటు పాఠశాలలను ఆశ్రయిస్తున్నారు. ఒక్క విద్యార్థి ఏడాదిపాటు చదవాలంటే సుమారు రూ. లక్ష పైనే ఖర్చవుతుంది. దీంతో ఏడాదిలో ఫీజు రూ. లక్ష కట్టలేక విద్యార్థుల తల్లిదండ్రులు నలిగిపోతు న్నారు. చివరిలో హాల్ టిక్కెట్లకు ముడిపెట్టడంతో తప్పని పరిస్థితుల్లో అప్పు చేసి ఫీజు చెల్లించే తల్లిదండ్రులు వేలల్లో ఉన్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఇదే అదునుగా విద్యార్థులను టెన్షన్ పెట్టి మరీ ఫీజులు లాగేస్తున్నాయి..

టీడీపీ 5 జనసేన 2



నిడదవోలు నుంచే కందుల దుర్గేష్

- రాజమహేంద్రవరం లోక్‌సభ బీజేపీకే
- పురందేశ్వరి పోటీ చేసే అవకాశం
- తీరిన రూరల్ - నిడదవోలు పంచాయితీ
- శేషారావును బుజ్జగించనున్న అధిష్ఠానం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం, నిడదవోలు నియోజకవర్గంలో నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. నిడదవోలు నియోజకవర్గం ఉమ్మడి అభ్యర్థిగా జనసేన నాయకుడు కందుల దుర్గేష్ పోటీ చేయనున్నారు. తెలుగుదేశం- జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా ఆయన పేరును జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సోమవారం అధికారికంగా ప్రకటించారు. తెలుగుదేశం, జనసేన,బీజేపీ పొత్తు నేపథ్యంలో జనసేనకు జిల్లాలో రెండు అసెంబ్లీ స్థానాలు దక్కాయి. ఇప్పటికే రాజానగరం నియోజకవర్గం నుంచి బత్తుల బలరామకృష్ణను జనసేన నుంచి ఉమ్మడి అభ్యర్థిగా ప్రకటించిన సంగతి తెలిసిందే. కందుల దుర్గేష్ రాజమహేంద్రవరం రూరల్ నుంచి పోటీచేయాలని మొదటి నుంచి భావిస్తున్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ అందుకు సుముఖత వ్యక్తం చేశారు. కానీ టీడీపీ-జనసేన పొత్తుల వల్ల రూరల్ సీటు సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరికి దక్కింది.ఈ నేపథ్యంలో టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ ఆలోచించి కందుల దుర్గేష్‌ను నిడదవోలు నుంచి పోటీ చేయించడానికి తొలిజాబితా విడుదల చేసిన రోజునే నిర్ణయించారు. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి ముందుగా చెప్పిన సంగతి తెలిసిందే. రాజమహేంద్రవరం రూరల్ సీటు దక్కకపోవడంతో మొదట్లో దుర్గేష్ కొంత ఇబ్బంది పడ్డారు. రూరల్ క్యాడర్ చాలా ఒత్తిడి తెచ్చింది. నిరసనలు, ఆందోళనలు చేసింది.అధిష్ఠానం సూచనలు మేరకు దుర్గేష్ రూరల్‌లోని జనసేన క్యాడర్, తన అభిమానులకు నచ్చచెప్పారు.అదే సమయంలో గోరంట్ల బుచ్చయ్యచౌదరి తన అనుచరులతో కలిసి నేరుగా దుర్గేష్ ఆఫీసుకు వెళ్లారు. ఇద్దరూ కాసేపు ఆత్మీయంగా మాట్లాడుకున్నారు.దీంతో రూరల్‌లో సమస్య పరిష్కారమైంది. దుర్గేష్‌కు నిడదవోలు సీటును అధికారికంగా ప్రకటించారు. కానీ నిడదవోలులో రెండు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన బూరుగుపల్లి శేషారావు మళ్లీ పోటీ చేయాలని చూశారు.ఆయనతో పాటు సీనియర్ నేత కుందుల సత్యనారాయణ సీటు ఆశించారు. టీడీపీ- జనసేన అధిష్ఠానం నిర్ణయాన్ని ఇప్పటికే సీనియర్ నేత కుందుల సత్యనారాయణ స్వాగతించారు.శేషారావు అనుచరులు ఇంకా నిరాశలో ఉన్నారు. శేషారావుకు నచ్చచెప్పే బాధ్యతను టీడీపీ అధిష్ఠానం తీసుకుంది. త్వరలో కందుల దుర్గేష్ కూడా శేషారావును కలిసే అవకాశం ఉంది.

పార్టీ నిర్ణయమే శిరోధార్యం : దుర్గేష్



పార్టీ నిర్ణయం శిరోధార్యం. రూరల్ నుంచి టికెట్ ఆశించా. కానీ పొత్తులు, సమీకరణల నేపథ్యంలో నేను నిడదవోలు నుంచి పోటీ చేయాల్సి వచ్చింది. నిడదవోలు టీడీపీ నేత బూరుగుపల్లి శేషారావు సమర్థనేత, ఆయన సంపూర్ణ సహకారాన్ని కోరుతున్నాను. త్వరలోనే ఆయననునేను నేరుగా కలుస్తా. రాజమహేంద్రవరం రూరల్‌లో క్యాడర్ తననే పోటీ చేయమని పట్టుపట్టినప్పుడు అధిష్ఠానం నిర్ణయం చెప్పి అందరినీ ఒప్పించా. నెమ్మదిగా బయటకు వస్తున్నారు. అందరూ గోరంట్ల బుచ్చయ్యచౌదరిని గెలిపిస్తారు. నిడదవోలులో కూడా అందరినీ ఒప్పించి, మెప్పిస్తా. తనకు నిడదవోలు ప్రజలు నేతలు కొత్త కాదు. ఇప్పటికే జనసేన ఇన్‌చార్జి, ఇతర క్యాడర్ నాకు మంచి మిత్రులే. పైగా నేను గతంలో పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేసినప్పుడు అందరికీ పరిచయస్తుడినే. నిడదవోలు ప్రజలు తనను ఆశీర్వదిస్తారు. నిడదవోలు నియోజకవర్గస్థాయిలో ఓ మేనిఫెస్టోను అమలు చేస్తానని స్పష్టం చేశారు.

ఇదీ ఆయన బయోడేటా..

కందుల దుర్గేష్ ఏయూలో ఎంఏ ఎకనామిక్స్ చదివారు. జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడిగా వ్యవహరిస్తున్నారు.కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్సీగా పనిచేయడంతో పాటు రాష్ట్ర విభజన తర్వాత తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా పార్టీని బలో పేతం చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి 2014లో రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేసి 21,243 ఓట్లు సాధించారు. తర్వాత జనసేనలో చేరారు. 2019లో రాజమహేంద్రవరం రూరల్ నుంచి జనసేన అభ్యర్థిగా పోటీ చేసి త్రిముఖ పోటీలో 42,685 ఓట్లు సంపాదించారు. దుర్గేష్ తాత పోతుల వీరభద్రరావు రాజమహేంద్రవరం మునిసిపల్ చైర్మన్‌గా మూడు సార్లు పనిచేశారు. 1962-67 లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా కూడా సేవలందించారు.

టీడీపీకి ఐదు సీట్లు

తెలుగుదేశం-జనసేన-బీజేపీ పొత్తు నేపథ్యంలో జిల్లాలో ఐదు అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ నేతలు పోటీ చేయనున్నారు. ఇప్పటికే ఒకటి రెండు స్థానాలు మినహా మిగతా చోట్ల అభ్యర్థులను ప్రకటించిన సంగతి తెలిసిందే. రేపోమాపో తుది జాబితా రానుంది. ఇక లోక్‌సభ స్థానాన్ని బీజేపీకి కేటాయిస్తారనే ప్రచారం జరుగుతుంది. బీజేపీ కూడా ఈ సీటును అడిగింది.బీజేపీకి ఇస్తే ఇక్కడ నుంచి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పోటీ చేసే అవకాశం ఉంది.

పనులు ప్రారంభించి నివేదిక ఇవ్వాలి

ఎన్నికల సమావేశంలో కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ త్వరలో వచ్చేస్తుంది. ఈ నేపథ్యంలో ఇటీవల క్షేత్రస్థాయిలో మంజూరైన పనులను ఆయా శాఖలకు చెందిన నోడల్ ఏజెన్సీ అధికారులు వెంటనే ప్రారంభించి నివేదికలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ డా. కె.మాధవీలత ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో సోమవారం ఎన్నికల విధులు, శాఖల వారీ మంజూరైన పనుల చేపట్టడంపై జేసీ ఎస్.తేజ్‌భరత్‌తో కలిసి కలెక్టర్ మాధవీలత అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. విధి నిర్వహణలో జవాబుదారీతనం ఉండాలన్నారు. ఎంపీ లాడ్స్, ఇతర ప్రభుత్వ శాఖల్లో ప్రతిపాదించి, ఆమోదించిన పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. ఆయా పనుల పురోగతిపై వెంటనే నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్ విషయంలో ప్రతి ఒక్కరూ కచ్చితత్వం కలిగి ఉండాలన్నారు. ఆయా శాఖల వివరాలను 24 గంటల్లోగా జిల్లా ఎన్నికల అధికారికి అందజేయాలన్నారు. ఎన్నికల కోడ్ ప్రకటించిన వెంటనే కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాలు, రాజకీయ నేతల ఫొటోలు తొలగించాలని,వివిధ కూడల్లో ఉండే విగ్రహాలకు ముసు గులు వేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, జిల్లా అధికారులు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

17న గ్రూప్-1 పరీక్ష

రాజమహేంద్రవరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 25 పరీక్షా కేంద్రాల్లో మార్చి 17న ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ డా.కె.మాధవీలత పేర్కొన్నారు. పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహించడానికి నోడల్, రూట్ అధికారులు ముందస్తుగా ఆయా కళాశాలలు, పాఠశాలల యాజమాన్యాలు, ప్రధానోపాధ్యాయులతో సమాశమై నివేదిక అందజేయాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో నోడల్ అధికారిగా జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్ వ్యవహరిస్తున్నారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచుతామని, మహిళల తనిఖీకి ప్రత్యేక గదిని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.డీఆర్‌వో జి.నరసింహులు, పౌరసరఫరాల శాఖ డీఎం రాధిక, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు ఎం.భానుప్రకాశ్, పి.సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల భద్రత ఏర్పాట్లపై ఎస్పీ సమీక్ష

రాజమహేంద్రవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికలను సజావుగా నిర్వహించే క్రమంలో పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నామని ఎస్పీ జగదీశ్ పేర్కొన్నారు.జిల్లా పోలీసు కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా జోన్ల డీఎస్పీలు వారి పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు, ప్రాంతాలు, రిసెప్షన్ సెంటర్లు, స్ట్రాంగ్ రూమ్స్, లెక్కింపు కేంద్రాలు, పార్కింగ్ ప్రదేశాలు, రూట్ మ్యాప్, బందోబస్తు, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం, స్ట్రైకింగ్ ఫోర్స్, యాక్టివ్ రౌడీషీటర్లు, బైండోవర్లు తదితర అంశాలను పీపీటీ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఎన్నికల రోజున ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ హాల్స్, రిసెప్షన్ సెంటర్లు, పార్కింగ్, బందోబస్తుపై సూచనలు చేశారు. గత ఎన్నికల్లో నమోదైన కేసుల విషయంలో ఈ ఎన్నికల సమయంలో ఎలాంటి చర్యలు తీసుకోవాలో చెప్పారు. ప్రతి రోజూ కేంద్ర పోలీస్ దళాలతో కవాతు, ఎన్నికలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులను ఎన్నికల విధులకు ఉపయోగించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(శాంతి భద్రతలు) పి.అనిల్‌కుమార్,ఎస్‌బీ డీఎస్పీ డి.ప్రభాకర్ పాల్గొన్నారు.

మొక్కుబడి వైద్యం



అందని ఎన్‌సీడీ వైద్యం

- నీరుగారుతున్న లక్ష్యం
- పట్టించుకోని వైద్యాధికారులు
- విభాగంలో 9 మంది సిబ్బంది
- పేద రోగులపై చిన్నచూపు
- ఏదో చేసి పంపించేస్తున్న వైనం
- ఏఆర్‌టీ బాధితులకే కేన్సర్ స్క్రీనింగ్
- పనితీరులో తీవ్ర నిర్లక్ష్యం

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 11 : రాజమహేంద్రవరం జీజీహెచ్‌లోని నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) క్లినిక్‌లో వైద్యసేవలు మొక్కుబడిగా సాగుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. ఎన్‌సీడీ క్లినిక్‌లో వైద్యసేవలు సక్రమంగా అందుతున్నాయా, డాక్టర్, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా, రోగులు వైద్య సేవలు ఉపయోగించుకుంటున్నారా లేదా అనే విషయాలపై అటు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారుల పర్యవేక్షణ, తనిఖీలు లేకపోవడం, జీజీహెచ్ అధికారులు మనకెందుకులే అనే ధోరణి ప్రదర్శించడంతో ఎన్‌సీడీ క్లినిక్ ఆశించిన ప్రయోజనం పూర్తిస్థాయిలో దక్కడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక్కడ ప్రతి రోజూ ఎంత మంది రోగులు వైద్యసేవలు వినియోగించుకుంటున్నారనే విషయంలో వైద్యాధికారులు, వైద్యులు గోప్యత పాటిస్తున్నారు. వివరాలు కోరినా చెప్పడానికి నిరాకరిస్తున్నారు. దీంతో అసలు ఎన్‌సీడీ వైద్యసేవలు ఎవరికి, ఎందుకు అనేదానిపై చర్చ సాగుతోంది. కేంద్ర ప్రభుత్వం నేషనల్ హెల్త్‌మిషన్‌లో భాగంగా నిర్వహిస్తున్న ఎన్‌సీడీ ప్రాజెక్టు ద్వారా అందించే వైద్యసేవలపై అవగాహన లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.

బీపీ, షుగర్ టెస్టులు రాయడం ...

ఎన్‌సీడీ క్లినిక్ (దీర్ఘకాలిక వ్యాధుల ఓపీడీ)ల ప్రధాన లక్ష్యం డయాబెటిస్, హృదయసంబంధ వ్యాధులు, స్ట్రోక్, కేన్సర్ వంటి వాటిపై నిశితమైన దృష్టిపెట్టాల్సి ఉంటుంది. వీటిని ముందుగానే గుర్తించడం, చికిత్స, ఫాలో అప్ కచ్చితంగా జరగాల్సి ఉంది. కానీ జీజీహెచ్‌లోని ఎన్‌సీడీ క్లినిక్‌లో ఓపీ సేవలు మొక్కుబడిగా మాత్రమే అందుతున్నాయి. వైద్యుడు రోగులకు బీపీ చూడడం, షుగర్ టెస్టులు రాయడం, మందులు రాసివ్వడం వంటి నామమాత్ర వైద్యమే చేసి పంపిస్తున్నారు. ఎన్‌సీడీ లక్ష్యాలకు అనుగుణంగా రోగానికి సంబంధించిన పూర్తి ప్రొఫైల్ క్లినిక్‌లో పక్కాగా రికార్డు చేయడంలేదనే ఆరోపణలున్నాయి. ఇక్కడ ఒక వైద్యుడు, ఏడుగురు స్టాఫ్‌నర్సులు, ఒక ల్యాబ్ టెక్నీషియన్ ఉన్నారు. దీర్ఘకాలిక వ్యాధుల ఓపీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ అంటే కేవలం మూడు గంటలు మాత్రమే ఉంటుంది. చాలాసార్లు వైద్యుడు అందుబాటులో ఉండడంలేదనే ఫిర్యాదులున్నాయి. ఈ మాత్రం వైద్యసేవలు జీజీహెచ్‌లోని సాధారణ ఓపీలోనూ లభిస్తుండడం గమనార్హం. జీజీహెచ్‌లోని జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీతో సహా జనరల్ ఫిజీషియన్లు అంతా ప్రతిరోజూ ఈ తరహా రోగాలకు వైద్యసేవలందిస్తున్నారు.ఇలాంటి పరిస్థితుల్లో ఎన్‌సీడీ క్లినిక్ ప్రత్యేకత, లక్ష్యం ఏమిటి ? అసలు దాని అవసరం ఏమిటనేదనేది ప్రశ్నార్థకంగా మారింది.



బ్రెస్ట్ కేన్సర్ సంబంధిత స్క్రీనింగ్ పరికరం

ఏఆర్‌టీ బాధితులకే కేన్సర్ స్క్రీనింగ్

ఎన్‌పీసీడీసీఎస్‌లో భాగంగా ఎన్‌సీడీ క్లినిక్‌కు అనుసంధానంగా కేన్సర్ స్క్రీనింగ్ యూనిట్ ఏర్పాటు చేశారు. షేర్ ఇండియా అనే సంస్థతో ఒప్పందం చేసుకుని బ్రెస్ట్, సర్వికల్ స్క్రీనింగ్ పరికరాలు అందుబాటులో ఉంచారు. అయితే ఇక్కడ కేవలం ఏఆర్‌టీ బాధిత మహిళలకే (హెచ్ఐవీ/ఎయిడ్స్) స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. సర్వికల్, బ్రెస్ట్ కేన్సర్‌కు సంబంధించిన స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి తుది రిపోర్టులు కాకినాడ పంపిస్తున్నారు. కేన్సర్ యూనిట్‌కు సంబంధించి ల్యాబ్, ఇతర సౌకర్యాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు కాలేదు. దీంతో ఈ ప్రక్రియ కూడా మొక్కుబడిగానే సాగుతోంది.

ఎన్‌సీడీ క్లినిక్ అంటే ..

నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ)నే దీర్ఘకాలిక వ్యాధులుగా పిలుస్తుంటారు. హృదయ సంబంధ వ్యాధులు, కేన్సర్, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు, మధుమేహం తదితర ప్రధాన ఎన్‌సీడీలను నివారించడానికి, నియంత్రించడానికి నేషనల్ ప్రోగ్రాం ఫర్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఆఫ్ కేన్సర్, డయాబెటిస్, కార్డియో వాస్క్యులర్ డిసీజెస్, స్ట్రోక్ (ఎన్‌పీసీడీసీఎస్) ప్రోగ్రాంను 2010లో ప్రారంభించారు. ఇందులో భాగంగా మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, మానవ వనరులు అభివృద్ధి, హెల్త్ ప్రమోషన్, ముందస్తు నిర్ధారణ, నిర్వహణ, రిఫరల్ ప్రధాన లక్ష్యాలుగా నిర్దేశించుకున్నారు. ఎన్‌సీడీల్లో ముందస్తు రోగనిర్ధారణ, చికిత్స, ఫాలో అప్ కోసం సేవలను అందించాల్సి ఉంది. ఎన్‌సీడీ క్లినిక్‌లకు హాజరయ్యే రోగులకు ఉచిత రోగ నిర్ధారణ సౌకర్యాలు, మందులు అందించాలి. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఈ ప్రక్రియ ఎన్‌సీడీ క్లినిక్‌ల్లో సక్రమంగా జరగడంలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ మాధవీలత

స్పందనలో 152 అర్జీలు స్వీకరణ

రాజమహేంద్రవరం సిటీ/రూరల్ మార్చి 11: స్పందన సమస్యలను తక్షణం పరిష్కరించాలని కలెక్టర్ మాధవీలత అన్నారు. రాజమహేంద్రవరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన జిల్లా స్థాయి స్పందన కార్యక్రమంలో కలెక్టర్, జేసీ తేజ్ భరత్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జిల్లా నలుమూలల నుంచి 152 మంది బాధితులు వచ్చి తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కుటీర పరిశ్రమ పెడతామంటే తమకు బ్యాంక్ రుణం ఇవ్వడంలేదని నిడదవోలు తిరుగూడెంకు చెందిన కృష్ణ, ఐదుగురు దివ్యాంగులు వాపోయారు. కాతేరు గ్రామానికి చెందిన బగుడు కృష్ణవేణి పాల ప్యాకెట్లు అమ్ముకుని జీవనం సాగిస్తున్నానని.. నా భర్త బడుగురెడ్డి మరణించాడని.. మాకు 24 ఏళ్ళ కుమారుడు రాజేష్ ఉన్నాడని.. తన ఇంటికి నా భర్త అన్నయ్య బడుగు ప్రసాదరావు వచ్చి ఇంటికి ఆక్రమించుకుని ఇబ్బందులు పెడుతున్నాడని న్యాయం చేయాలని వేడుకుంది. ద్వారాకా తిరుమలకు చెందిన గద్దె సత్యవతి తన ఆస్తిని తన కొడుకు, కుమార్తె తనకు తెలియకుండా వేరే వారికి అమ్మేశారని.. న్యాయం చేయాలని వేడుకుంది. రాజమహేంద్రవరం 49వ డివిజన్‌కు చెందిన మాసా రామ్‌జోగ్ క్వారీ గోతిలో పడి మృతిచెందిన తుమ్మల లోవరాజు మృతికి కారకుడైన క్వారీ ఓనర్ పై కేసు నమోదు చేయాలని ఆ ప్రాంత ప్రజలకు రక్షణకు చర్యలు చేపట్టాని కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఆయా అర్జీలను పరిశీలించిన కలెక్టర్ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

గోదావరి తీరంలో అక్రమ కట్టడాలు ఆపాలని వినతి



కొవ్వూరు, మార్చి 11 : కొవ్వూరు గోదావరి తీర ప్రాంతంలో చేపడుతున్న అనదికార కట్టడాలను వెంటనే తొలగించాలని గోవు గౌతమి గోదావరి పరిరక్షణ సమితి సభ్యులు ఫిర్యాదు చేశారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డివిజనల్ స్పందనలో 6 ఫిర్యాదులను స్వీకరించారు. గోవు గౌతమి గోదావరి పరిరక్షణ సమితి సభ్యుడు వై.కె.శ్రీనివాస్, గంధం బాబ్జి మాట్లాడుతూ కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో గీతా మందిరం ఎదురుగా, గోదావరిమాత విగ్రహం వద్ద గోదావరి బండ్ పార్క్ లో చర్చి నిర్వాహకులు పార్క్‌ను ఆక్రమించి శాశ్వత కట్టడాలను నిర్మిస్తున్నారని నిలుపుదల చేయాలని మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారికి తెలియజేసినా పట్టించుకోవడం లేదన్నారు. తక్షణం ఆక్రమణలను తొలగించి, సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ ఏవో కె. రవి విక్రమ్ పాల్గొన్నారు.

పిఠాపురం ఆర్వో నియామకంపై దుమారం

ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా జాయింట్ కలెక్టర్ ప్రవీణ్‌ఆదిత్య

తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన జనసేన

నిబంధనలు పాటించలేదని రాష్ట్ర ఎన్నికల అధికారికి ఫిర్యాదు

సీఈసీ ఆదేశాలతో పశ్చిమగోదావరికి బదిలీ

పిఠాపురం, మార్చి 11: పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కాకినాడ జిల్లా జేసీని ప్రవీణ ఆదిత్య నియామకం రాజకీయ దుమారం లేపింది. ఆయన నియామకంలో నిబంధనలు పాటించలేదనే ఆరోపణలతో, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు జనసేన ఫిర్యాదుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆయన్ను పశ్చిమగోదావరి జేసీగా బదిలీ చేస్తూ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది.

జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ పిఠాపురం నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారనే ప్రచారం ఉన్న నేపథ్యంలో ఇక్కడి ఎన్నికలను అధికార వైసీపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. పవన్ పోటీ చేస్తే ఎలాగయినా ఓడించాలని ప్రయత్నాలు ప్రారంభించింది. ఇందుకుగాను తమకు అనుకూలమైన అధికారులు నియోజకవర్గ పరిధిలో ఉండేలా అధికార వైసీపీ నేతలు ప్రయత్నిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే రంపచోడవరం ఐటీడీఏ పీవోగా, పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేసిన ప్రవీణ ఆదిత్యను జిల్లా జాయింట్ కలెక్టరుగా నియమించడంతోపాటు పిఠాపురం అసెంబ్లీ ఆర్వో బాధ్యతలు అప్పగించడంపై జనసేన పార్టీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి, లీగల్‌సెల్ చైర్మన్ సాంబశివ ప్రతాప్, కార్యదర్శి కోటేశ్వరరావు అమరావతిలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనాను కలిసి ఫిర్యాదు చేశారు. ఉమ్మడి జిల్లాలోనే నాలుగేళ్లకు పైగా విధులు నిర్వర్తించిన అధికారిని ఇక్కడ ఎలా నియమిస్తారని వారు ప్రశ్నించారు. కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలకు విరుద్ధంగా జేసీగా, పిఠాపురం ఆర్వోగా నియామకం జరిగిందని వారు ఫిర్యాదులో తెలిపారు. అధికార పార్టీ నేతలతో ఆయనకు సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. తక్షణం ఆయన్ను ఆర్వో బాధ్యతలనుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. మరోవైపు పిఠాపురం నియోజకవర్గంలో ఫారం-7 తప్పుడు దరఖాస్తుల ద్వారా ఓట్ల తొలగింపునకు ప్రయత్నాలు జరిగాయన్న ఆరోపణలు వచ్చాయి. దీనిపై విచారణ జరిపిన అధికారులు దరఖాస్తుల్లో వాస్తవం లేదని తేలడంతో అధికార వైసీపీకి చెందిన పలువురు నేతలపై పోలీసు కేసులు నమోదయ్యాయి.

అంతా రహస్యమే

పిఠాపురం అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా నియమితులైన జేసీ ప్రవీణ్ ఆదిత్య వ్యవహారశైలిని పలువురు తప్పుబట్టారు. ఆర్వోగా నియమితులైన తర్వాత ఆయన పిఠాపురంలో నిర్వహించిన సమావేశాలకు సంబంధించి మీడియాకు సమాచారం లేకుండా గోప్యంగా నిర్వహించడాన్ని టీడీపీ, జనసేన నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు, సమావేశాలు అందరికి తెలియాల్సి ఉండగా, గోప్యంగా ఉంచడం ఎందుకని వారు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లా జేసీ ప్రవీణ్ ఆదిత్యపై బదిలీ వేటు పడింది. జిల్లా జాయింట్ కలెక్టర్‌గా విధుల్లో చేరిన కొద్ది నెలల్లోనే ఆయన్ను పశ్చిమగోదావరి జిల్లాకు బదిలీ చేశారు. ఆ స్థానంలో పశ్చిమగోదావరి జిల్లా జేసీగా ఉన్న ఎస్.రామసుందరెడ్డిని జిల్లా జేసీగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

సినిమాల ద్వారా తెలుగు సాహిత్యానికి పెద్దపీట


మాట్లాడుతున్న మీర్ అబ్దుల్లా

పోర్టుసిటీ(కాకినాడ), మార్చి 11: సినిమా ద్వారా తెలుగు సాహిత్యానికి పెద్ద పీట వేయాలని పడమట సంధ్యారాగం చిత్ర సహ నిర్మాత, సినీ నటుడు మీర్ అబ్దుల్లా అన్నారు. ఓ ప్రైవేట్ హోటల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జంధ్యాల దర్శకత్వంలో వచ్చిన పడమటి సంధ్యారాగం చిత్రానికి సహ నిర్మాతగాను, హీరోయిన్ చిన్నాన్న పాత్రలోను నటించానన్నారు. పూర్తి గ్రామీణ వాతావరణంలో తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా పడమటి సంధ్యారాగం రెండో భాగానికి . దర్శకత్వం వహిస్తున్నానని చెప్పారు. వర్ధమాన నటీనటులతో చిత్రం రూపొందిస్తున్నానని, కథ సిద్ధమైందని తెలిపారు. ఈ వారంలోనే ఈ చిత్రం సెట్స్‌పైకి వస్తుందని చెప్పారు. పడమటి సంధ్యారాగం చిత్రంలో జాతి, మత, ప్రాంతీయ సామరస్యం అంతర్లీనంగా ఉంటుందని, ఇప్పుడు తీస్తున్న రెండో భాగంలో అన్ని అంశాలు మిళితమై ఉంటాయన్నారు. సమావేశంలో కవి, రచయిత వేదుల శిరీషా పాల్గొన్నారు.

ఓటుంటే..చీర


చీరలు పంపిణీ చేస్తున్న వారి దగ్గర గుమిగూడిన జనం

రాజమహేంద్రవరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రలోభాల చీరల పంపిణీ తంతు కొనసాగుతూనే ఉంది. ఎన్నికల వేళ తాయిలాలను ఇంటికి వెళ్లి మరీ చేతిలో పెడుతున్నారు. సోమవారం నారాయణపురం, సీతంపేట, లలితానగర్ తదితర చోట్ల పంపిణీ జరిగింది. ఐదారుగురు వైసీపీ కార్యకర్తల బ్యాచ్‌కి వలంటీరు, సచివాలయ సిబ్బందిని జతకలిపి వీధుల్లోకి పంపుతున్నారు. ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్, ఓటరు లిస్టులో పేరు చెక్ చేసి చీరను అందజేస్తున్నారు. సోమవారం నారాయణపురంలో చీరలు ఇస్తున్న సమయంలో ఒకామె ఓటును ఎగరగొట్టేశారనే విషయం తెలిసింది. దీంతో సచివాలయానికి వెళ్లాలని చీరల పంపిణీ బృందం ఆమెకు ఉచిత సలహా ఇచ్చింది. తన ప్రమేయం లేకుండా ఓటు ఎలా తొలగించారనే ప్రశ్నకు సమాధానం కరువైంది. పైగా చీరల పంపిణీ బృందం వద్ద ట్యాబ్ ఉంటోంది. ఆ ట్యాబ్‌లో కూడా ఓటును, డోర్ నంబరును సరి చూసుకుంటున్నారు. కచ్చితంగా అవి సరిపోలితేనే చీర ఇస్తున్నారు. ఓటు లేని లేదా సాంకేతిక ఇబ్బందులు ఉన్నా, ఓటరు లిస్టులో పేరు లేకపోయినా చీర ఇవ్వడం లేదు. పంపిణీ చేయడానికి జిల్లాకు లక్షల సంఖ్యలో చీరలు వచ్చినట్టు సమాచారం. ఆయా ప్రాంతాల నాయకుల కనుసన్నల్లో తంతు నడుస్తోంది.

మమ్మల్ని వదిలేయండి..వెళ్లిపోతాం

వైసీపీ నేతల సభకు వచ్చిన మహిళలు గగ్గోలు


మహిళలను అడ్డుకుంటున్న యానిమేటర్లు

అంబాజీపేట, మార్చి 11: మమ్మల్ని వదిలేయండి..వెళ్లిపోతాం అంటూ వైసీపీ నేతల సభకు వచ్చిన మహిళలు గగ్గోలు పెట్టారు. అయినా వారిని వదలకపోవడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన వైఎస్సార్ 4వ విడత చేయూత నిధుల విడుదల కార్యక్రమం మహిళలకు చుక్కలు చూపించింది. ఈ సభకు జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వైసీపీ చేసిన కార్యక్రమాలు, పథకాలంటూ ప్రసంగాలను ఏకరవు పెట్టారు. అయితే ఈ సభను మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తారని చెప్పడంతో ముందుగానే మహిళలు సభా వేదిక వద్దకు వచ్చారు. ప్రజాప్రతినిధులు ఆలస్యంగా రావడంతో సభ ఆలస్యంగా ప్రారంభమైంది. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు వెళ్లిపోతున్న సమయంలో డ్వాక్రా యానిమేటర్లు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ప్రసంగాలు జరిగే వరకూ తాము ఉండలేమని యానిమేటర్లతో మహిళలు వాగ్వివాదానికి దిగారు. మహిళలు వెళ్లిపోవడంతో సభను త్వరగా ముగించి వేశారు.

హంస వాహనంపై కుక్కుటేశుడు

పాదగయలో ఘనంగా శ్రీపుష్పోత్సవం


హంస వాహనంపై విహరిస్తున్న స్వామివారు

పిఠాపురం మార్చి 11: భక్తుల శివనామస్మరణ మధ్య అమ్మవారితో కలిసి కుక్కుటేశుడు హంస వాహనంపై పుష్కరిణిలో విహరించారు. శ్రీపుష్పోత్సవం సందర్భంగా స్వామి, అమ్మవార్లు విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో వేంచేసి ఉన్న రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు సోమవారం రాత్రితో ముగిశాయి. చివరి రోజు కుక్కుటేశుని తెప్పోత్సవం కన్నుల పండువగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను హంస వాహనంపై ఉంచి తెప్పోత్సవం నిర్వహించారు. తెప్పోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

వైభవంగా శ్రీపుష్పోత్సవం

కుక్కుటేశ్వరస్వామికి ఉదయం స్వామికి అభిషేకం, రాజరాజేశ్వరీ దేవికి కుంకుమార్చనలు జరిగాయి. రాత్రి పది గంటలకు శ్రీపుష్పోత్సవం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ఆలయ అర్చకులు కోట వీరవెంకట సత్యనారాయణమూర్తి, కోట దత్తాత్రేయశర్మ, కైతేపల్లి రాజ్‌కుమార్‌శర్మ, కోట విశ్వనాథశర్మ విశేష అలంకరణ చేశారు. పూజల్లో పాల్గొన్న మహిళలకు దంపత తాంబూలాలు అందజేశారు. అనంతరం ఏకాంతసేవాగానం జరిగింది. ఆస్థాన వేద పండితులు ద్విభాష్యం సుబ్రహ్మణ్యశర్మ ఘనాపాఠి, చెరుకుపల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, ఆలయ కార్యనిర్వహణాధికారి పులి నారాయణమూర్తి, ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, ఉత్సవకమిటీ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తోపులాట

శ్రీపుష్ప యాగం తర్వాత భక్తులకు దంపత తాంబూలాలు అందించే సమయంలో తోపులాట చోటుచేసుకుంది. తెప్పోత్సవం, పూజా కార్యక్రమాల నిర్వహణ ఆలస్యం కావడంతో రెండు గంటలకు పైగా వేచి ఉన్న భక్తులందరినీ ఒకేసారి వదిలారు. దీంతో తొక్కిసలాట చోటుచేసుకుంది. భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. లోపలకు వెళ్లేందుకు ఒకేసారి భక్తులు ప్రయత్నించడం, క్యూలైన్లు సరిగ్గా లేకపోవడం, దంపత తాంబూలాలకు భారీగా భక్తులు తరలివస్తారని తెలిసినా, తగిన ఏర్పాట్లు చేయడంలో ఆలయ అధికారులు విఫలం కావడం వల్ల ఈ సంఘటన చోటుచేసుకుందని పలువురు ఆరోపిస్తున్నారు.

వైభవంగా శ్రీపుష్ప యాగోత్సవం


ఊయల మందిరంలో స్వామి,అమ్మవారు

సామర్లకోట, మార్చి 11: కుమారరామ భీమేశ్వర స్వామి, బాలా త్రిపుర సుందరి అమ్మవార్లకు శ్రీపుష్పయాగోత్సవ పూజలు సోమవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ఉత్సవ ఫెస్టివల్ అధికారిణి అల్లు వెంకట దుర్గాభవాని, కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజలలో భాగంగా కల్యాణ వేదికపై స్వామి వారు, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, అంజిబాబు, శ్రీనివాసరావు, వినయ్, వెంకన్న తదితరుల ఉత్సవ మూర్తులను బాలాత్రిపుర సుందరి అమ్మవారి మందిరం వద్దకు తీసుకుని వచ్చారు. వివిధ రకాల పూలతో అలంకరించిన ఊయల మందిరంలో ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి భక్తుల దర్శనాలకు అనుమతించారు. దాతలు సమకూర్చిన 110 రకాల పిండి వంటకాలను ఊయల మండపం వద్ద ఉంచారు. అనంతరం ప్రముఖులకు దంపత తాంబూలాలు అందజేశారు. సుమారు 2,000 మంది భక్తులు శ్రీపుష్పయాగ పూజలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిక్కిన పరమేశ్వర సాయి సత్యనారాయణ, తూతిక కామేశ్వరరావు, చుండ్రు శ్రీనువాసుసూర్యభాను, కంచర్లపద్మావతి జగన్నాథగుప్త, గంజి బూరిబాబు పాల్గొన్నారు.

జీజీయూలో మెడ్ యునైటెడ్ ఆస్పత్రి ప్రారంభం


ఓ విభాగాన్ని పరిశీలిస్తున్న చైతన్యరాజు

రాజానగరం, మార్చి 11: గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆస్పత్రిని చైతన్య సంస్థల చైర్మన్, జీజీయూ చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు(చైతన్యరాజు) సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక పరికరాలతో అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు కలిగి ఉండడం మెడ్ యునైటెడ్ ఆస్పత్రి ప్రత్యేకత అన్నారు. తమ సంస్థ ప్రతి ఉద్యోగి, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యమిస్తూ ఆస్పత్రిని ఏర్పాటు చేశామన్నారు. జీజీయూ ఉద్యోగులు, విద్యార్థులతో పాటు ఇతరులు కూడా ఆసుపత్రి సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అమలాపురంలోని కిమ్స్ మేనేజింగ్ డైరెక్టర్ కె.రవికిరణ్ వర్మ మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణను ప్రోత్సహించి తొలి మెడిసిన్ సదుపాయం అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. అనంతరం మెడ్ యునైటెడ్ ఆసుపత్రిని చైతన్యరాజు ప్రారంభించగా, జనరల్ వార్డును శశికిరణ్ వర్మ, ఫార్మసీని రవికిరణ్ వర్మ, కన్సల్టేషన్ గదులను డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ పీఎంఎంఎస్ శర్మ, ప్రత్యేక గదులను డైరెక్టర్ టీవీ ప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో గైట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.లక్ష్మీ శశివర్మ, పీజీ రామానుజం, బాబు, కె.వల్లీమావి, రామచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

తాయిలాల పర్వం

మహిళలకు చీరలు పంపిణీ చేసిన చిర్ల జగ్గిరెడ్డి

వేర్వేరు చోట్ల మహిళా దినోత్సవం పేరుతో ప్రలోభాలకు తెర



పంపిణీ చేసిన చీర


చీరలు పంపిణీ చేస్తున్న చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం, మార్చి 11: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో గెలుపు కోసం ఓటర్లకు తాయిలాల పంపిణీకి వైసీపీ తెరలేపింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఏ కార్యక్రమం జరుగుతున్నా దానిని తనకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. సోమవారం రావులపాలెంలో రెండు వేర్వేరు చోట్ల మహిళా దినోత్సవం నిర్వహించి మహిళలకు చీరలు, స్వీట్ బాక్సులు పంపిణీ చేశారు. సీఆర్సీలో రావులపాలెం, కొత్తపేట, ఆత్రేయపురం, ఆలమూరు మండలాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, వైసీపీ తరపున పోటీ చేసి ఓటమి చెందిన వారితో సమావేశం కాగా.. మరో ప్రైవేటు కల్యాణ మండపంలో అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, యానిమేటర్లు, పీహెచ్‌సీ డాక్టర్లు సిబ్బందితో మహిళా దినోత్సవం వేడుకల్లో సమావేశమయ్యారు. విడివిడిగా మహిళా దినోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, ఆయన సతీమణి, కుటుంబ సభ్యులతో పాటు తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి పాల్గొన్నారు. జగన్, జగ్గిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సోమసుందరెడ్డి ఫొటోలతో ఉన్న చీర బాక్సు, స్వీటు బాక్సులను మహిళలకు అందజేసి తన గెలుపునకు కృషి చేయాలని కోరినట్టు సమాచారం. అంతే కాకుండా పలు రకాల వంటకాలతో పసందైన విందును కూడా మహిళల కోసం ఏర్పాటు చేశారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకే జగ్గిరెడ్డి ఇలాంటివి చేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం


రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు

రాయవరం, మార్చి 11: రాయవరం మండలం చెల్లూరు శివారు ఎర్రమట్టిపురంలో రేకుల షెడ్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని సోమవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినట్లు విశ్వసనీయ సమాచారంపై విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లయ్స్ అధికారులు తనిఖీలు నిర్వహించగా 24 బస్తాల్లో నిల్వ ఉంచిన 1035 కిలోల రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన కోట సత్యం అనే వ్యక్తి చెల్లూరు, పాశర్లపూడి గ్రామాల్లో కార్డుదారుల నుంచి కిలో బియ్యం 14 రూపాయలకు కొనుగోలు చేసి మొక్కజొన్న విత్తనాలు కలిపి కోళ్లఫారాలకు 16 రూపాయలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.53 వేల 92 రూపాయలు ఉంటుందని అంచనా వేసి కోట సత్యంతో పాటు సంబంధికులపై 6ఏ కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ కేఎస్ఎస్వీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాజమండ్రి రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పరిధిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బియ్యం అక్రమ రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతోందని, ఎవరైనా రేషన్ బియ్యం కొనుగోలు, అమ్మకాలు సాగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అధికారులు జగన్నాథం, రాయవరం సీఎస్‌డీటీ అవిఫా, జీవానందం, లోవరాజు పాల్గొన్నారు.

దోపిడీ కేసులో నాలుగేళ్ల శిక్ష

అమలాపురం టౌన్, మార్చి 11: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ఏరుపల్లి గ్రామంలో 2010 డిసెంబరు 30న జరిగిన దోపిడీ కేసులో ముద్దాయి తిల్పిడియా రంజిత్‌సింగ్ అలియాస్ బడాసింగ్‌కు నాలుగేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ రామచంద్రపురం సెషన్స్ కోర్టు జడ్జి కె.వెంకటేశ్వరరావు తీర్పు ఇచ్చినట్టు ఎస్పీ కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ద్రాక్షారామ ఎస్ఐ జి.సురేంద్ర తెలిపిన వివరాల ప్రకారం... ఏరుపల్లిలో చల్లా వెంకటేశ్వరరావు ఇంట్లో అర్ధరాత్రి సమయంలో నిజామాబాద్ జిల్లా బాన్సువాడకు చెందిన రంజిత్ సింగ్‌తో పాటు మరో ఏడుగురు చొరబడ్డారు. వెంకటేశ్వరరావుతో పాటు ఆయన కుటుంబ సభ్యులపై కత్తులతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచి బంగారు ఆభరణాలు అపహరించుకుని పారిపోయారు. అప్పట్లో వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ద్రాక్షారామ పోలీసు స్టేషన్‌లో అప్పటి ఎస్ఐ ఎండీ ఉమర్ కేసు నమోదు చేయగా సీఐ ఎం.రాజారావు ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. రంజిత్‌సింగ్‌తో పాటు మిగిలిన వారిని అరెస్టు చేసి రిమాండుకు పంపించారు.స్పీడీ ట్రయల్ కేసుగా గుర్తించి ఎస్ఐ సురేంద్రతో పాటు కోర్టు కానిస్టేబుల్ వాసిరెడ్డి జానకిరామయ్య కోర్టులో సాక్ష్యులను హాజరుపరచగా ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎంవీవీఎస్ఎస్ ప్రకాష్ వాదనలు వినిపించారు. వాదోపవాదాల అనంతరం రంజిత్‌సింగ్‌పై నేరం రుజువు కావడంతో శిక్ష విధించారు.

గంజాయి స్వాధీనం

నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు

రాజానగరం, మార్చి 11: ఒడిసా నుంచి కేరళ రాష్ట్రానికి గంజాయిని తరలిస్తున్న నలుగురు రాజానగరం పోలీసులకు పట్టుబడ్డారు. కేరళకు చెందిన నలుగురు వ్యక్తులు లగేజీ బ్యాగుల్లో 39.35 కిలోల గంజాయిని లారీలో తరలిస్తుండగా మార్గమధ్యంలో తూర్పుగోనగూడెం పోలీసు చెక్‌పోస్టు వద్ద పోలీసులకు చిక్కారు. లారీలో ప్రయాణికులు మాదిరిగా బ్యాగుల్లో గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నామని పోలీసులు తెలిపారు. గంజాయి విలువ రూ.2 లక్షలు ఉంటుందని సీఐ పి.కాశీవిశ్వనాథ్ తెలిపారు. ఈ మేరకు నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు.

ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీ

ఒకరి మృతి..ముగ్గురికి గాయాలు



అనపర్తి, మార్చి 11: అనపర్తి మండలం లక్ష్మీనరసాపురం వంతెన వద్ద సోమవారం రెండు బైకులు ఢీకొని నలుగురు వ్యక్తులు తీవ్రగాయాలపాలయ్యారు. వారిలో ఒకరు మృతి చెందారు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. మండపేటకు చెందిన ఇళ్ల సూర్యసాయిరామ్, ఇప్పనపాడుకు చెందిన గొరసా సాయిచంద్ ఒక బైక్‌పై వస్తుండగా మరో బైక్‌పై మండపేటకు చెందిన కొమ్మిశెట్టి వెంకటేష్(29), సత్తిబాబు సోదరులు పెద్దాపురం పనికి వెళ్లి పని ముగించుకుని తిరుగు ప్రయాణంలో వస్తున్నారు. వారి రెండు బైక్‌లు లక్ష్మీనరసాపురం కెనాల్ రోడ్డులో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గాయపడిన అందరినీ రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించగా వెంకటేష్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మిగిలిన వారు చికిత్స పొందుతున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామారావు తెలిపారు.

పంట బోదెలో మృతదేహం

కాజులూరు, మార్చ్ 11: కాజులూరు మండలం కోలంక శివారు చలివేంద్రపాడు వెళ్లే రోడ్డులో పందుల పాక సమీపంలో గుర్తుతెలియని మృతదేహాన్ని గ్రామస్థులు గుర్తించారు. ఈ మేరకు స్థానిక వీఆర్వో ఫిర్యాదు మేరకు గొల్లపాలెం ఎస్ఐ తులసీరామ్, ఇతర పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం మొత్తం ఉబ్బిపోయి గుర్తు పట్టలేని స్థితిలో ఉంది. ముఖానికీ, శరీరానికి పురుగులు పట్టి దుర్వాసనతో కూడుకుని ఉంది. శరీరంపై తెలుపు, పచ్చ రంగు చారలు కలిగిన పొడవు చేతుల చొక్కా, సిమెంటు రంగు నిక్కరు, మెడలో తెలుపు రంగు తువ్వాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు సుమారు 5 రోజుల క్రితం మరణించి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. సంఘటనపై కేసు నమోదు చేసిన గొల్లపాలెం ఎస్ఐ తులసీరామ్ దర్యాప్తు చేస్తున్నారు.


మాట్లాడుతున్న ఏపీఎస్సీహెచ్ఈ వైస్ చైర్మన్ కె.రామ్మోహన్‌రావు

ఏబీసీ ద్వారా డిగ్రీ, డిప్లమో, పీజీ డిప్లమో కోర్సులు

జేఎన్టీయూకే, మార్చి 11: అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ (ఏబీసీ) ద్వారా డిగ్రీ, డిప్లమో, పీజీ డిప్లమో కోర్సులు విద్యార్థులు పూర్తిచేసేందుకు వీలు కలుగుతుందని ఏపీ ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ కె.రామ్మోహన్‌రావు అన్నారు. జేఎన్టీయూకేలోని వీసీ సమావేశ హాల్లో ఓడీఎల్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో ఎన్ఏడీ డిజిలాకర్, డిజిటల్ ఇండియా కార్పొరేషన్, ఎంఈఐటీ సహకారంతో రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ ప్రతినిధులకు ఏబీసీ విధానాలు, ప్రక్రియలు, సమ్మతి అనే అంశంపై సోమవారం వర్క్‌షాప్‌ను నిర్వహించారు. దీనిలో రామ్మోహన్‌రావు ముఖ్య అతిథిగానూ, వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు,రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ ఎల్.సుమలత గౌరవ అతిథులుగానూ పాల్గొనగా ఓడీఎల్ డైరెక్టర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రావు మాట్లాడుతూ నూతన జాతీయ విద్యావిధానం ప్రకారం ఏబీసీ దేశంలోని ఉన్నత విద్యాసంస్థల్లో ఒక కోర్సులో తగిన క్రెడిట్ ట్రాన్స్‌ఫర్ మెకానిజంతో చదువుకునేందుకు, విద్యార్థులు సులభతరంగా విద్యనభ్యసించేందుకు ఉద్దేశించిందన్నారు. అనంతరం వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ ఏబీసీ ద్వారా విద్యార్థి క్రెడిట్‌ల ప్రామాణికతను గోప్యంగా ఉంచడంతో పాటూ డిజిటల్ మోడ్ ద్వారా సులభంగా క్రెడిట్‌లను బదిలీ చేసుకోవచ్చన్నారు. 2020-21 విద్యాసంవత్సరంలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఈనెల 31లోగా గ్రేడ్ షీట్‌లను ప్రచురిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రవిపాండే, ఎస్.చంద్రమోహన్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో పోటీకి

మాజీ ఎంపీ గీతకు అడ్డంకులు తొలగినట్టే

రంపచోడవరం, మార్చి11: వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు అరకు మాజీ ఎంపీ కొత్తపల్లి గీతకు అడ్డంకిగా ఉన్న సీబీఐ కేసులో శిక్షను తెలంగాణా హైకోర్టు రద్దు చేసింది. బ్యాంకును మోసగించిన కేసులో కొత్తపల్లి గీతకు సీబీఐ కోర్టు శిక్ష, జరిమానా విధించిన విషయం తెలిసిందే. దీనిపై ఆమె తెలంగాణ హైకోర్టులో అప్పీలుకు వెళ్లారు. ఆ కేసు విచారణలో ఉంది. అయితే ప్రస్తుతం ఆమె బీజేపీ నుంచి ఎంపీగా పోటీ చేసేందుకు సిద్ధమవడంతో దిగువ కోర్టు విధించిన శిక్షను రద్దు చేసి ఎన్నికల్లో పోటీ చేసేందుకు అర్హత కల్పించాలని కొత్తపల్లి గీత తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఆమె చేసుకున్న వినతిని హైకోర్టు ఆమోదించింది. ఆమెపై ఉన్న శిక్షను రద్దు చేస్తూ ఇటీవల తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులను జారీ చేసింది.

ఏజెన్సీ సమాచారం

స్పందనకు 27 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

రంపచోడవరం, మార్చి 11: స్పందనలో స్వీకరించిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని సబ్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఏపీవో(జీ) సీహెచ్ శ్రీనివాసరావుతో కలిసి స్పందన దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ వారం సుమారు 27 అర్జీలు అందాయని చెప్పారు. కార్యక్రమంలో డీడీలు అబుసలాం, షరీఫ్, ఎస్డీసీ డీఎస్ శాస్త్రీ, ఏడీఎంహెచ్‌వో ప్రకాశం, డీఈవో మల్లేశ్వరరావు, వైద్యాధికారిణి ఇందిరా, డీఎల్‌పీవో కోటేశ్వరరావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'జగన్‌ది అబద్ధాల విషపు జల్లు'

రంపచోడవరం, మార్చి 11: మేదరమెట్లలో సభలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అబద్ధాల విషపు జల్లు కురిపించారని మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి అన్నారు. విలేకర్ల సమావేశంలో సోమవారం ఆమె మాట్లాడుతూ నాసిరకం మద్యంతో ప్రజల జీవితాలను నాశనం చేశాడని, ఏటా మూడు లక్షల ఉద్యోగాలు కల్పిస్తానని నట్టేట ముంచాడన్నారు. సీపీఎస్ రద్దు చేస్తానని మోసం చేశారని విద్యుత్ చార్జీలు 9 సార్లు పెంచి రూ.64 వేల కోట్లు ప్రజలపై భారం మోపారన్నారు. ప్రజలను మోసం చేసేందుకే మేదరమెట్ల సభను నిర్వహించారని చెప్పారు. సభలో తొక్కిసలాటలో ప్రాణం కోల్పోయిన బాధితుడి కుటుంబానికిపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

'వైసీపీది అరాచక పాలన'

మోతుగూడెం, మార్చి 11: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో కొత్తపల్లి పంచాయతీ సుకుమామిడి గిరిజన గ్రామంలో చింతూరు టీడీపీ ప్రధాన కార్యదర్శి మల్లెల వెంకటేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జ్ ఓబుల్‌లేని నరసింహారావు ఆధ్వర్యంలో సోమవారం బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. వైసీపీ అరాచక పాలనతో విసిగిపోయిన ప్రజలు వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబు నాయకత్వంలో టీడీపీ, జనసేన, బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఉమ్మడి మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలను అమలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సుకుమామిడి టీడీపీ సీనియర్ నాయకులు కుండ్ల లింగారెడ్డి, టీడీపీ మహిళా కార్యకర్తలు రాణి బుచ్చమ్మ, టీడీపీ సీనియర్ నాయకులు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేన జెండా ఆవిష్కరణ

అడ్డతీగల, మార్చి 11: అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగలలో సోమవారం జనసేన, టీడీపీ, బీజేపీ నాయకుల సమక్షంలో తాటికొండ రాజేంద్ర ఆధ్వర్యంలో జనసేన జెండా ఆవిష్కరించారు. ముందుగా మూడు పార్టీల నాయకులు అడ్డతీగలలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమావేశం నిర్వహించి మండలంలో కార్యాచరణపై చర్చించారు. నాయకులు కాకి స్వామి, ఎర్రయ్య, వెంకటరాయుడు, రవిబాబు, సాగర్, సురేష్, గవర్రాజు, మేడిశెట్టి శ్రీను, కామన బుజ్జి, నానిబాబు, మహిళా నాయకులు భూదేవి, వరలక్ష్మి బీజేపీ నాయకులు ఏ.పండు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

ఎటపాక, మార్చి 11: బాల్య వివాహాలను అరికట్టాలని ఈ మేరకు గ్రామ కమిటీ సభ్యులు అవగాహన కల్పించాలని ఎంపీపీ కాకా కామేశ్వరి కోరారు. ఎటపాకలో బాల్య వివాహాల నిషేధిత సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ కాకా కామేశ్వరి మాట్లాడారు. చిన్న వయస్సులో వివాహాలు చేసుకోవడంతో జరిగే అనర్థాలపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని అన్నారు. బాల్య వివాహాలను ముందుగానే గుర్తించి, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బాలరాజు, వెలుగు ఏపీఎం స్వామి, ఆర్ఐ బాపిరాజు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు

ఎటపాక, మార్చి 11: 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఉచితంగా 25 శాతం సీట్లు కేటాయిస్తున్నట్లు ఎంఈవో బాలరాజు ఓ ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందని, మార్చి 5 నుంచి 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఏప్రిల్ 1న లాటరీ విధానంలో అర్హులైన వారి తొలి జాబితాను విడుదల చేస్తారని వెల్లడించారు. ఏప్రిల్ 2 నుంచి 10 వరకు విద్యార్థుల అడ్మిషన్స్ ఫైనల్ చేసి, ఏప్రిల్ 15న లాటరీ ద్వారా రెండో లిస్ట్ ప్రకటిస్తారని తెలిపారు. ఏప్రిల్ 16 నుంచి 23 తేదీ వరకు వివిధ ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్స్ ఖరారు చేస్తారని అన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



చింతూరు, మార్చి 11 : అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన రేషను బియ్యాన్ని రెవెన్యూ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఐ దారయ్య తెలిపిన వివరాలు మేరకు చింతూరు మండలం, గంగన్నమెట్ట వద్ద ఓ ఇంట్లో 256 బ్యాగుల రేషను బియ్యం నిల్వ చేసి ఉంచారు. అక్కడ నుంచి వారు మరో ప్రాంతానికి వాటిని తరలించేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ సమాచారం ఓ ఉన్నతాధికారికి తెలియడంతో అధికారులు అక్కడకు వెళ్లి బియ్యాన్ని సీజ్ చేశారు. బియ్యం ఎవరు నిల్వ చేశారు. ఏ ప్రాంతం నుంచి ఇక్కడకు తీసుకొచ్చారు తదితర వివరాలపై విచారణ నిర్వహిస్తున్నామని ఆర్ఐ చెప్పారు.

బస్ స్టేషన్‌లో సదుపాయాలు కల్పించాలి

రంపచోడవరం, మార్చి 11: ఏజెన్సీ ప్రధాన కేంద్రమైన రంపచోడవరం బస్ స్టేషన్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని మాజీ ఉప సర్పంచ్ కె.ఎల్.ఎన్.గురుప్రసాద్ కోరారు. కనీస మౌలిక సదుపాయాలు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. పేరుకే బస్‌స్టేషన్ తప్పా ఆర్వో ప్లాంటు, లైట్లు, క్యాంటీన్, ఫ్యాన్‌లు, నైట్ హాల్ట్ బస్ సిబ్బందికి రెస్ట్ రూమ్‌లు లేవన్నారు. సీసీ కెమెరాలు, కంట్రోలర్, బస్ టైమింగ్స్‌ను డిస్‌ప్లే చేయాలని కోరారు.

ఉపాధి కూలీ మృతి

రాజవొమ్మంగి మార్చి 11: రాజవొమ్మంగి గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం కూలీ అయినవిల్లి అప్పారావు సోమవారం పనికి వెళ్లి అక్కడ పని చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. తోటి కూలీలు ,ఉపాధి హామీ మేటు స్థానిక పీహెచ్‌సీకి తీసుకుని వెళ్లగా అక్కడ ప్రాథమిక వైద్యం చేసి కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అప్పారావు మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

రాజవొమ్మంగి మార్చి 11: రాజవొమ్మంగి గ్రామంలోని ప్రధాన రహదారిపై అల్లూరి జంక్షన్ వద్ద సోమవారం రాత్రి 11 కేవీ విద్యుత్ వైర్ తెగిపడింది. విద్యుత్ సరఫరా అవుతున్న వైర్ ఎప్పుడూ రద్దీగా ఉండే ప్రధాన రహదారిపై తెగిపడడంతో సమీపంలో ఉన్న ప్రజలు బెంబేలెత్తిపోయారు. కాసేపటికే విద్యుత్ సరఫరాను నిలిపివేసి మరమ్మతులు చేశారు. దీనిపై విద్యుత్ శాఖ అధికారులను ఆంధ్రజ్యోతి ఫోన్‌లో వివరణ కోరగా ఏఈ చిన్నబాబు మాట్లాడుతూ ఓ లారీ లాగడంతోనే విద్యుత్ వైర్ తెగిపడిందని చెప్పారు.

17మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ

రాజవొమ్మంగి మార్చి 11: మండలంలోని 17 మంది లబ్ధిదారులకు సోమవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ గోము వెంకటలక్ష్మి అధ్యక్షతన ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు.తహశీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో యాదగిరేశ్వరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు శింగిరెడ్డి రామకృష్ణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పోలీసు స్పందనకు 22 ఫిర్యాదులు

రాజమహేంద్రవరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు ఫిర్యాదులు అందజేశారు. ఎస్పీ జగదీశ్ ఆదేశాలతో ట్రాఫిక్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి సమస్య తెలుసుకొని అర్జీలు స్వీకరించారు. చట్టపరిధిలో జాప్యం లేకుండా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈస్ట్ జోన్‌కి సంబంధించిన 9, సౌత్‌జోన్ 4, సెంట్రల్ 7, కొవ్వూరు డివిజన్‌కి సంబంధించి రెండు ఫిర్యాదులు అందాయి.

సీఎం జగన్ బీసీల ద్రోహి

» ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

రాజమహేంద్రవరం రూరల్, మార్చి 11: సీఎం జగన్ బీసీల ద్రోహి అని, వైసీపీ హయాంలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని బీసీలకు మొదటి నుంచి అండగా వున్న ఏకైక పార్టీ టీడీపీ అని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. జయహో బీసీ కార్యక్రమంలో భాగంగా బీసీ ప్రచార వాహనాలను ఆయన నివాసం వద్ద పార్టీ నాయకులతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ సమాజంలో సగభాగమైన బీసీలను వైసీపీ ప్రభుత్వం వేధిస్తోందన్నారు. 300 మంది బీసీలను పొట్టన పెట్టుకున్నారని, వందలాది మందిపై అక్రమ కేసులు బనాయించి జైళ్ళకు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. 30కి పైగా పథకాలను రద్దుచేసి బీసీలను ఆర్థికంగా అణగదొక్కారని ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి రాగానే బీసీలకు రక్షణ చట్టం తీసుకొస్తారని, వారి అభివృద్ధే ధ్యేయంగా చంద్రబాబు ప్రణాళికలు తయారు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వెలుగుబంటి సత్యప్రసాద్, మార్గాని సత్యనారాయణ, చెల్లుబోయిన శ్రీనివాస్, పితాని శివరామకృష్ణ, షేక్ సుభాన్, మత్యేటి ప్రసాద్, పండూరి అప్పారావు, ఆళ్ళ ఆనందరావు పాల్గొన్నారు.



బీసీ ప్రచార వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

భవిష్యత్తుకు గ్యారెంటీ ఇచ్చేది కూటమి: వాసు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 11: వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమికి ఓట్లు వేసి మన భవిష్యత్తుకు బంగారు బాట వేసుకుందామని ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 46వ డివిజన్‌లో సోమవారం టీడీపీ నాయకులతో కలిసి భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగితెలుసుకున్నారు. టీడీపీ-జనసేన ఉమ్మడి మెనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు అందించారు. వాసు మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికల్లో ప్రజలు తమ తీర్పును స్పష్టంగా తెలియజేయాలన్నారు. టీడీపీ-జనసేన అధికారంలోకి రావాలని చంద్రబాబు సీఎం కావాలన్నారు. కార్యక్రమంలో 46వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు మండల రవికుమార్, తురకల నిర్మల, మజ్జి రాంబాబు, ఆగురు ధనరాజ్, మొకమాటి సత్యనారాయణ, పిడిమి ప్రకాష్, మండల విశ్వేశ్వరరావు, కేబుల్ మురళీ, సందక లక్ష్మణరావు పాల్గొన్నారు.

నాసిరకం మద్యంతో ఆరోగ్యాలు నాశనం.. రాష్ట్రంలో నాసిరకం మద్యంతో 35 లక్షల మంది ఆరోగ్యాలను సీఎం జగన్ నాశనం చేశాడని ఆదిరెడ్డి వాసు మండిపడ్డారు. అటువంటి మద్యం వల్ల రాష్ట్రంలో 30వేల మంది కిడ్నీ, లివర్ చెడిపోయి ప్రాణాలు పోయాయని, వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ఈ క్రమంలో జగన్ లక్ష కోట్లు కమిషన్ కొట్టేశాడని ఆరోపించారు. అందుకే మద్యం దుకాణాల్లో డిజిటల్ పేమెంట్స్ లేకుండా చేశాడని అన్నారు.



గోనగూడెంలో జనసేనలో చేరిన కార్యకర్తలతో బలరామకృష్ణ

మహిళాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం: సూర్యకుమారి

అనపర్తి, మార్చి 11: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం అవసరమని తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు జుత్తుగ సూర్యకుమారి అన్నారు. సోమవారం అనపర్తిలోని పలు ప్రాంతాల్లోను, చినద్వారపూడిలోను తెలుగు మహిళలు మహాశక్తి పథకాల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మినీ మేనిఫెస్టోలోని పథకాలను వివరించారు. ఈ సందర్భంగా సూర్యకుమారి మాట్లాడుతూ వైసీపీ పాలనలో మహిళాభివృద్ధి కుంటుపడిందని, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో మహిళా నేతలు సిరసపల్లి లక్ష్మి, ఒంటిమి గౌతమి, పోతంశెట్టి సుభాషిణి, మల్లేశ్వరి, చిన్నమ్మ, బేరా వేణమ్మ పాల్గొన్నారు.

ఈలకొలనులో మహాశక్తి ప్రచారం

రంగంపేట, మార్చి 11: మండలం ఈలకొలను గ్రామంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సతీమణి మహాలక్ష్మి మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఉమ్మడి మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వెలుగుబంటి సతిబాబు, కొమ్మన రాంబాబు, కె.సాయిబాబు, ఆచంట వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

బేషజాలను పక్కన పెట్టండి: పెందుర్తి

కోరుకొండ, మార్చి 11: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వ్యక్తిగత భేషజాలన పక్కన పెట్టి టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించడానికి మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలని మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ అన్నారు. సోమవారం రాత్రి కోరుకొండలోని టీడీపీ కార్యాలయం వద్ద పార్టీ మండల నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ పార్టీలు సీటు ఇవ్వలేదని కానీ, మన సింబల్ కాదని ఏ ఒక్కరు నిర్లక్ష్యం వహించకూడదన్నారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఎంతో దూరదృష్టితో రాష్ట్ర పరిస్థితులు కేంద్ర ప్రభుత్వానికి వివరించి రాష్ట్రాన్ని పునఃనిర్మించడానికి బీజేపీతో కలిసి కూటమిగా ఏర్పడ్డారన్నారు. సమావేశంలో రొంగల శ్రీనివాస్, మింగి లక్ష్మీనారాయణ, చెలగంశెట్టి శ్రీను, కోర్పు బుజ్జి, కొయ్యా శామ్యూల్, నూనె వెంకన్న పాల్గొన్నారు.

జనసేనలో చేరిన గోనగూడెం వైసీపీ నాయకులు

కోరుకొండ, మార్చి 11: మండలంలోని పశ్చిమగోనగూడెం గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం రాత్రి టీడీపీ-జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో జనసేన పార్టీలోకి చేరారు. వారందరికీ ఆయన కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చింతపల్లి శేఖరం, విజయకుమార్, భాగ్యరాజు, రాయుడు నాగేశ్వరరావు, గోనపాటి లక్ష్మి, కొత్తపల్లి వెంకన్న, ప్రకాశరావు తదితరులు పార్టీలో చేరారు. అవినీతి అరాచక పాలన చేస్తూ, అడ్డగోలుగా వ్యవహరిస్తున్న స్థానిక ఎమ్మెల్యే వైఖరిపై విసుగు చెంది పవన్‌కల్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలకు ప్రభావితమై తాము జనసేనలోకి చేరుతున్నట్టు ప్రకటించారు. కార్యక్రమంలో రొంగల శ్రీనివాస్, కొయ్యా శామ్యూల్, బొమ్ముల గంగరాజు, బొమ్ముల వీరబాబు, చిటికెన చల్లారావు పాల్గొన్నారు.

దాళ్వా వరికి చీడపీడల ఉధృతి లేదు

» ఏరువాక కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ నరసింహారావు

దివాన్‌చెరువు, మార్చి 11: ప్రస్తుతం దాళ్వా వరి పంట ఈనిక దశ నుంచి గింజ పాలు పోసుకునే దశలో ఉందని, పెద్దగా చీడపీడల ఉధృతి లేదని ఏరువాక కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా నరసింహారావు తెలిపారు. తాను, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.అచ్యుతరాజు జిల్లాలోని రాజానగరం, అనపర్తి, కడియం మండలాల్లోని దాళ్వా వరి, కూరగాయల పంటలను క్షేత్ర సందర్శన ద్వారా వ్యవసాయాధికారులతో కలిసి పరిశీలించినట్టు సోమవారం ఇక్కడ విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. అక్కడక్కడ కాండం తొలిచే పురుగు, ఆకుముడత పురుగు గమనించామని తెలిపారు. నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2గ్రాములు లేదా క్లోరంట్రి నిలిప్రోల్ 0.3మి.లీ. నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. దోమపోటు కనిపిస్తే పురుగుల సంఖ్యను బట్టి పురుగు మందులు వాడాలన్నారు. సుడిదోమ ఆశిస్తే ట్రైఫ్లుమిజోపెరిమ్(పెక్సలాన్) ఎకరాకు 96మి.లీ.లను 200లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. కడియం పరిసర ప్రాంతాల్లో సార్వా వరి తరువాత బంతిసాగు చేసిన రైతులతో లాభసాటి పంటల సాగు గురించి చర్చించామన్నారు. అలాగే కూరగాయ పంటల్లో మిరప, బెండలలో చీడపురుగుల నివారణకు సూచనలు చేశారు. మిరపలో పైముడతకు కారణమైన తామర పురుగుల నివారణకు ఫిప్రోనిల్ 2మి.లీను ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని చెప్పారు.



పంటలను పరిశీలిస్తున్న ఏరువాక జిల్లా కోఆర్డినేటర్ నరసింహారావు

లక్ పతి దీదీ రుణాల అందజేత

రాజమహేంద్రవరం రూరల్, మార్చి 11: లక్ పతి దీదీ పథకం ద్వారా జిల్లాలో 21 స్వయం సహాయక సంఘాలకు రూ.30 లక్షల రుణాలను, 1188 స్వయం సహాయక సంఘాలకు రుణాల కింద రూ.113 కోట్లు బ్యాంక్ లింకేజీ ద్వారా రుణాలు అందజేసినట్టు జిల్లా కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. స్కిల్ ట్రైనింగ్‌లో భాగంగా ఎల్ఈడీ బల్బులు, ప్లంబింగ్, డ్రోన్ రిపెయిరింగ్ తదితర టెక్నికల్ స్కిల్స్ నేర్పిస్తారన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్, డీఆర్వో నరశింహులు, ఎస్‌వీవీయస్ మూర్తి, సంబంధిత శాఖల సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఘనంగా దేవరమ్మ జాతర

కడియం, మార్చి 11: మాధవరాయుడుపాలెంలో అన్నందేవుల వంశ ఇలవేల్పు దేవరమ్మ జాతర సోమవారం ఘనంగా జరిగింది. ఈ జాతర ప్రతి మూడేళ్లకోసారి జరుగుతుంది. సర్పంచ్ అన్నందేవుల చంటి, విజయ దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకకు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న అన్నందేవుల కుటుంబసభ్యులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆత్మీయ విందు చేశారు. కార్యక్రమంలో అన్నందేవుల వీరభద్రరావు(చిన్నారి), అన్నందేవుల నారాయణరావు(పెదబాబు), అన్నందేవుల వీరాస్వామినాయుడు, అన్నందేవుల శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

16న కుసుమ ధర్మన్న జయంత్యుత్సవం

దివాన్‌చెరువు, మార్చి 11: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లోని కుసుమ ధర్మన్న కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 16న నన్నయ విశ్వవిద్యాలయంలో మహాకవి కుసుమ ధర్మన్న జయంత్యుత్సవాన్ని నిర్వహిస్తున్నామని ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను వీసీ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన వీసీ మాట్లాడుతూ 16న తెలుగు జాతీయ సదస్సు, కవి సమ్మేళనం, కుసుమ ధర్మన్న సాహితీ పురస్కారాలు అందిస్తారన్నారు. జాతీయ సదస్సులో భాగంగా 30 మంది అధ్యాపకులు, పరిశోధకులు పత్రసమర్పణ చేస్తారని చెప్పారు. ధర్మన్న సాహితీ ప్రస్థానం సామాజిక సేవ అనే అంశంపై 53 మంది కవులు కవితాగానం చేస్తారన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ డి.జ్యోతిర్మయి, కన్వీనర్ తరపట్ల సత్యనారాయణ, తెలుగుశాఖ కోర్సు కోఆర్డినేటర్ కేవీఎన్‌డీ వరప్రసాద్, అధ్యాపకులు తలారి వాసు, డి.లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

కవాతులో రాజమహేంద్రవరం డీఎస్పీ కిషోర్‌కుమార్

అనపర్తి, మార్చి 11: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని, పోలీసులు రక్షణగా ఉంటారని రాజమహేంద్రవరం డీఎస్పీ కిషోర్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో కేంద్ర బలగాలతో నిర్వహించిన కవాతులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలపై ప్రజల్లో ఉన్న భయాందోళనలు తొలగించాలన్న లక్ష్యంతో కేంద్ర బలగాలతో అనపర్తి, దుప్పలపూడి, రామవరం, కుతుకులూరు గ్రామాల్లో కవాతు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో సీఐ పి.శివగణేష్, ఎస్ఐలు రామారావు, హనుమంతరావు, ఏఎస్ఐలు పాల్గొన్నారు.

రేపు 'పీఎం సూరజ్' వర్చువల్‌గా ప్రారంభం

రాజమహేంద్రవరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఈనెల 13న ప్రధానమంత్రి మోదీ పీఎం సూరజ్ కార్యక్రమాన్ని వర్చువల్‌గా ప్రారంభించనున్నారని, ఈ మేరకు స్థానిక ఆర్ట్స్ కాలేజీలో ఏర్పాట్లు చేస్తున్నామని కేంద్ర సామాజిక న్యాయ, సాధికారిత మంత్రిత్వ శాఖ జనరల్ మేనేజర్ డేవిడ్ ఫ్రాంగేట్ తెలిపారు. ఆర్ట్స్ కాలేజీలో జరుగుతున్న ముందస్తు ఏర్పాట్లను సోమవారం రాత్రి ఆయన పర్యవేక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ డా.కె.మాధవీలతను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్సీ, ఓబీసీ, సఫారీ కార్మికులకు రూ.లక్ష వరకూ రుణాల క్రెడిట్ మద్దతు మంజూరు, మురుగు, సెప్టిక్ ట్యాంక్ కార్మికులకు ఆయుష్మాన్‌భవ హెల్త్‌కార్డుల పంపిణీ, పీపీఈ కిట్ల పంపిణీ ఆయన రిమోట్ బటన్ నొక్కడం ద్వారా అందించనున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి వర్చువల్‌గా ప్రారంభించే ఈ జిల్లా స్థాయి కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు ఆర్ట్స్ కాలేజీలో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్టును రద్దు చేయాలి

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 11: ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేసేంత వరకూ పోరాటం ఆగదని అడ్వకేట్స్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్నాలకోట వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం అడ్వకేట్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ధర్నాలకోట మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు పూర్తిస్థాయిలో అమలు జరిగితే ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణ కరవు అవుతుందన్నారు. దీనివల్ల లా అండ్ ఆర్డర్ అదుపు తప్పే అవకాశం ఉందన్నారు. ఈ యాక్టును తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సొసైటీ రాష్ట్ర నాయకులు గంజి రామ్‌గోపాల్, దారా ఆదిశేషు, కుందేటి రాణి, కేవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా రవి



రాజమహేంద్రవరం సిటీ, మార్చి 11: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా రాజమహేంద్రవరానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు కాటం రవి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఆయనకు ఉత్తర్వులు అందాయి. 40 ఏళలగా కాంగ్రెస్‌లో సేవలు చేస్తున్నారు. తనపై నమ్మకంతో రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించిన పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిళారెడ్డి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఏపీఆర్‌సీఎస్ ప్రధాన కార్యదర్శిగా వీరాంజనేయులు



రాజమహేంద్రవరం సిటీ, మార్చి 11: ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం (ఏపీఆర్‌సీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మెట్ట ప్రాంతానికి చెందిన కర్నాకుల వీరాంజనేయులు రెండో సారి ఎన్నికయ్యారు. ఈ మేరకు రైతుకూలీ సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. విజయవాడలో సోమవారం ఏపీఆర్‌సీఎస్ 43వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన సమావేశంలో వీరాంజనేయులు రెండోసారి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, ఇదే జిల్లాకు చెందిన వల్లూరి రాజబాబు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు.

కనిపించిన నెలవంక.. రంజాన్ ప్రారంభం



రాజమహేంద్రవరం సిటీ, మార్చి 11: నింగిలో నెలవంక దర్శమివ్వడంతో ప్రపంచ వ్యాప్తంగా రంజాన్ నెల ఆరంభమైంది. మంగళవారం నుంచి నమాజ్‌లు ప్రారంభమవుతాయి. ముస్లింలు ఉపవాస దీక్షలు చేస్తారు. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని మజీద్‌లను విద్యుద్దీపాలతో అలంకరించారు. రాజమహేంద్రవరంలో పెద్దమసీదుతో పాటు రాయల్ మసీద్, జాంపేట మసీదు, నెహ్రూనగర్, జైల్‌వార్డర్ లైన్ కొంతమూరు, రెహ్మాత్‌నగర్ తదితర ప్రాంతాల్లోని మసీదులు అన్ని రంజాన్ నమాజ్‌లకు సిద్ధంగా ఉన్నాయి. రాయల్ మసీదులో సోమవారం రాత్రి ట్రస్ట్‌బోర్డు అధ్యక్షుడు షేక్ అబ్దుల్ కరీమ్, ట్రస్ట్ ధన్‌షావలీ విజయవాడ నుంచి రంజాన్ నెల ప్రారంభం ప్రకటన వచ్చిందని తెలిపారు. మంగళవారం రంజాన్ వేళలు సహరీ తెల్లవారుజామున 4-53 గంటలకు, ఇఫ్తార్ సాయంత్రం 6-21 గంటలకు ఉంటుంది.

మహిళల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

గోకవరం, మార్చి11: మహిళల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని మాజీ మంత్రి తోట నరసింహం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ మహిళా పక్షపాతి అని, మంత్రివర్గంలో సైతం ప్రాధాన్యం కల్పించారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జడ్పీటీసీ దాసరి శ్రీరంగ, తోట రాంజీ, దాసరి చినబాబు, వరసాల ప్రసాద్, సమ్మిట మోహన్ పాల్గొన్నారు.

పలు కళావేదికలు ప్రారంభం

బిక్కవోలు/రంగంపేట, మార్చి 11: మండలంలో గ్రాసిం ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్మించిన నాలుగు కళావేదికలను సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి గ్రాసిం ప్రతినిధి మురళీకృష్ణతో కలసి ప్రారంభించారు. వీటిలో బలభద్రపురంలో రెండు, ఆర్ఎస్.పేటలో ఒకటి, కాపవరంలో ఒకటి ఉన్నాయి. అలాగే బలభద్రపురంలో గ్రాసిం సంస్థ నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను, కాపవరంలో జలజీవన్ మిషన్‌లో నిర్మించిన తాగునీటి కుళాయిలు, పైప్‌లైన్లను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బుంగా రామారావు, యామన దుర్గాభవాని, సత్యంశెట్టి వెంకటరమణ, వైసీపీ నాయకులు నల్లమిల్లి వెంకటరెడ్డి, రొంగల అప్పాజీ, గువ్వల సత్తిరెడ్డి, యామన దుర్గారావు పాల్గొన్నారు. అలాగే రంగంపేట మండలం జి.దొంతమూరులో గ్రాసిం ఇండస్ట్రీస్ సౌజన్యంతో నిర్మించిన కల్యాణ మండపాన్ని ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పేపకాయల రాంబాబు, కొల్లాటి ఇశ్రాయేలు, అడబాల వెంకటేశ్వరరావు, గ్రాసిం సంస్థ ప్రతినిధి మురళీకృష్ణ పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన

రంగంపేట, మార్చి 11: బాల్యంలో పోషకాహారం ఎంత బాగా లభిస్తుందో మానసిక వికాసం అంత బాగా జరుగుతుందని, పిల్లలకు సరైన పోషణ లభించాలంటే తల్లికి కూడా పూర్తి పోషణ అందించడం తప్పని సరని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి జెస్సీ ఫ్లోరెన్స్ సూచించారు. పోషణపక్వాడ కార్యక్రమంలో భాగంగా సోమవారం రంగంపేటలో చిరుధాన్యాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా న్యూట్రీ ఎగ్జిబిషన్, గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ శ్రీలక్ష్మీ, సీహెచ్‌వో కె.జయమణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, ఆశాలు, తల్లులు పాల్గొన్నారు.

15న విజయవాడలో బహుజన భేరి

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 11: బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 15న విజయవాడ విద్యాధరపురం లేబల్ కాలనీ గ్రౌండ్స్‌లో బహుజన భేరి సభను నిర్వహిస్తున్నామని ఆ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ చిత్రసేన తెలిపారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో దళితులకు రక్షణ లేదని ,దళిత సంక్షేమ పథకాలను ప్రభుత్వం రద్దుచేసిందన్నారు. ఇటువంటి తరుణంలో బహుజనులు రాజ్యాధికారం కోసం బీఎస్పీని అధికారంలోకి తెచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 15న జరిగే బహుజన భేరి సభలో భవిష్యత్ కార్యాచరణ రూపొందించి ఎన్నికలకు వెళతామన్నారు.

బీఎస్పీ అభ్యర్థులు వీరే.. బీఎస్పీ రాజమండ్రి పార్లమెంట్ అభ్యర్థిగా గెడ్డం నెల్సన్‌బాబు, రూరల్ అసెంబ్లీ అభ్యర్థిగా పట్నాల విజయకుమార్, రాజమండ్రి అభ్యర్థిగా ఇసుకపట్ల రాంబాబు అనపర్తి అభ్యర్థిగా కొల్లాపూర్ శ్రీను, కొవ్వూరు అభ్యర్థిగా చోళ్ళ రాజు, నిడదవోలు అభ్యర్థిగా గుమ్మాపు చిత్రసేన పోటీ చేస్తారని చెప్పారు. ఈ సమావేశంలో బీఎస్పీ నాయకులు పరమట గణేశ్వరరావు, గడ్డం ప్రసాద్, కొండపల్లి సూరిబాబు, బయ్య మునీంద్ర, బుద్ధ జాన్, కొల్ల ధనరాజు, చిగురుపాటి రాఘవ, గుమ్మాపు ఏసురత్నం పాల్గొన్నారు.

కార్పొరేషన్ స్పందనకు 30 అర్జీలు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 11: రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం కమిషనర్ దినేష్‌కుమార్ నిర్వహించిన స్పందనలో 30 అర్జీలను స్వీకరించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రజల నుంచి అర్జీలను కమిషనర్ స్వీకరించారు. కె.బుర్రరాజు అనేవ్యక్తి జెన్యునిటీ సర్టిఫికెట్ కోసం, సంజీవయ్యనగర్‌కు చెందిన డి.శ్యామల తమ ప్రాంతంలో అక్రమ భవన నిర్మాణాలు నిలుపుదల చేయాలని, వీర భద్రనగర్‌లో వాటర్ ట్యాంక్ పూర్తిగా పాడైపోయిందని దానిని మరమ్మతులు చేయించాలని విన్నవించారు. వాటిని కమిషనర్ పరిశీలన చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, ఎస్ఈ జి పాండురంగారావు, సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: భీమా
సూర్యామినీ	: సైతాన్
సూర్యాప్యాలస్	: ఊరుపేరు భైరవకోన
స్వామి	: భీమా
శివజ్యోతి	: భీమా
అనుశ్రీ(సాయికృష్ణ)	: ప్రేమలు
రాజా	: భీమా
ఊర్వశి	: హనుమాన్
రంభ	: రికార్డు బ్రేక్
మేనక	: బాబు నెం.1, బుల్ షిట్..
అప్సర	: గామి
కుమారి	: గామి
వీఎస్ మహాల్(నామవరం)	: భీమా
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: గామి
వెంకటసూర్య(కడియం)	: భీమా
సత్యగౌరి (అనపర్తి)	: భీమా
సూర్యశ్రీ (అనపర్తి)	: ఊరుపేరు భైరవకోన
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: గామి
రామకృష్ణ(కోరుకొండ)	: భీమా
గీతాసినిమాస్ (సీతానగరం)	: భీమా
శ్రీనివాస (గోకవరం)	: భీమా
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: ఊరుపేరు భైరవకోన
లలితామహాల్(రంపచోడవరం)	: భీమా
నవయుగ(చింతూరు)	: భీమా



టెన్‌షన్ పెట్టేస్తున్నారు!



బకాయి ఫీజు కడితేనే 'పది' హాల్ టిక్కెట్లు

» ప్రైవేటు పాఠశాలల్లో ఇదీ తీరు
» ఫీజులు చెల్లించాలని సందేశాలు
» లేకపోతే హాల్ టిక్కెట్లు ఇవ్వం
» నలిగిపోతున్న విద్యార్థులు
» తల్లిదండ్రుల ఉరుకులు.. పరుగులు
» జిల్లాలో 29,990 మంది విద్యార్థులు
» 18 నుంచే పదో తరగతి పరీక్షలు
» హాల్ టిక్కెట్లు ఆపితే ఊరుకోం
» అధికారుల హెచ్చరిక

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఓ ప్రైవేటు పాఠశాలలో ఓ విద్యార్థిని పదో తరగతి చదువుతోంది. హాల్ టికెట్ కోసం వెళ్లగా.. 'నువ్వు ఇంకా రూ.3500 ఫీజు కట్టాలి. మీ నాన్నను ఆ ఫీజు కట్టేసి హాల్ టికెట్ తీసుకెళ్లమను' అని కరాఖండిగా చెప్ప డంతో విద్యార్థి ఏడుస్తూ ఇంటికి వెళ్లిపోయింది. వెలుగులోకి రాని ఇలాంటి ఘటనలు జిల్లాలో జరుగుతున్నాయి. విద్యార్థుల జీవితానికి తొలిమెట్టు వంటి పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఇంకా వారం రోజులే సమ యం ఉంది. అయితే విద్యార్థులను కొన్ని ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాలు 'హాల్‌టికెట్‌కి ఫీజు బకాయి'కి లంకె పెట్టి ఆందోళనకు గురిచేస్తున్నారు.వాస్తవానికి హాల్ టికెట్‌ని కచ్చితంగా విద్యార్థికి అందజేయాలి. ఇతర వ్యవహారాలకు ముడిపెట్టి హాల్ టికెట్ ఇవ్వ కుండా ఉంటే నేరం చేసినట్లే.కానీ పరీక్షలే అదనుగా ఫీజులను బలవంతంగా రాబట్టుకొనేందుకు తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నారు. బకాయి చెల్లించకపోతే హాల్ టికెట్ ఇవ్వబోమంటూ విద్యార్థులను భయపెడుతున్నారు. దీంతో తల్లిదండ్రులు అప్పులకు పరుగులు పెడుతున్నారు.

ఇదా సమయం?

ప్రైవేటు స్కూల్స్ విద్యతో వ్యాపారం చేస్తుంటాయి. ఫీజులపైనే నిర్వహణ ఖర్చు, లాభాలు, వ్యాపార విస్తరణ ఆధారపడి ఉంటాయి. ఇవన్నీ తెలిసినా పిల్లల భవిష్యత్తు మెరుగ్గా ఉంటుందనే ఆశతో తల్లిదండ్రులు ప్రైవేటు వైపు మొగ్గు చూపుతారు. అయితే ఫీజుల బకాయిలు రాబట్టుకోడానికి వార్షిక పరీక్షలు సమయం కాదని, పిల్లలు మానసికంగా ఇబ్బంది పడితే ఆ ప్రభావం పరీక్షా ఫలితాలపై పడుతుందని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరీక్షలు దగ్గరకు వచ్చే సమయంలో ప్రైవేటు తీరు మరీ దారుణంగా తయారవుతోంది.పదోతరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేసి మరీ వేధిస్తున్నాయి. కార్పొరేట్/ సెంట్రల్/హెడ్ ఆఫీస్ నుంచి టీం వచ్చారు. ఫీజు తక్షణం కట్టకపోతే హాల్ టికెట్‌కి రావొద్దంటూ బెదిరిస్తున్నాయి. దీంతో తల్లిదండ్రులు తెలిసిన వారు, బంధువులకు ఫోన్లు చేసి అప్పు కోసం అర్థిస్తున్నారు. ఫీజు ఈ రోజు కట్టేస్తు న్నారా, నేను పరీక్ష రాస్తానా లేదా? అంటూ పిల్లలు కన్నీరు పెడుతుంటే ఆ తల్లిదండ్రుల మనోవేదన వర్ణనాతీతం.గతేడాది ఏప్రిల్ 3 నుంచి పది వార్షిక పరీక్షలు జరిగాయి. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పరీక్షలను 15 రోజులు ముందుకు జరిపారు. దీంతో మార్చి 18 నుంచే పరీ క్షలను నిర్వహిస్తున్నారు.

గతంలో పబ్లిక్ డొమైన్‌లో

విద్యార్థులకు ఇబ్బంది రాకూడదనే ఉద్దేశంతో గతంలో హాల్ టికెట్లను పబ్లిక్ డొమైన్‌లో పెట్టేవారు. అంటే విద్యార్థి నేరుగా హాల్ టికెట్‌ని ప్రింట్ తీసుకొని పరీక్షలకు హాజరుకావచ్చు. హాల్ టికెట్‌పై హెచ్‌ఎం /ప్రిన్సిపాల్ సంతకం కేవలం ఐచ్ఛికం (ఆప్షనల్) మాత్రమే. దీంతో విద్యార్థులకు ఊరడింపుగా, తల్లిదండ్రులకు ప్రశాంతంగా ఉండేది. కానీ ఈ ఏడాది పబ్లిక్ డొమైన్‌లో పెట్టడంపై ఇంకా సమాచారం లేదు. ప్రతి ఏడాదీ హాల్‌టికెట్‌కి ఫీజు బకాయిలకు లంకె పెడుతుండడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నా విద్యాశాఖ అధికారులు 'ఎందుకనో' ముందుగా ఎలాంటి ప్రకటనా విడుదల చేయడం లేదు. పబ్లిక్ డొమైన్‌లో హాల్ టికెట్లను ఉంచి అనుగుణంగా విద్యాశాఖ అధికారులు ప్రకటన వెలువరిస్తే విద్యార్థులకు చాలా మటుకు తిప్పలు తప్పే అవకాశం ఉంది. పైగా సందట్లో సడేమియా అనే మాదిరిగా ఫీజులను పూర్తిగా నగదు రూపంలో కట్టించుకుంటున్నా, ఆన్‌లైన్ విధానాన్ని పక్కన పెట్టేసినా, కోట్ల రూపాయల్లో నగదు లావాదేవీలు జరుగుతున్నా సంబంధిత శాఖలు కాలు మెదపకుండా బ్లాక్ మనీకి తమవంతు పరోక్షంగా సహకరిస్తున్నారనే అపవాదు ఉంది.

హాల్ టికెట్లు ఆపడానికి వీల్లేదు
కె.వాసుదేవరావు, డీఈవో



ఫీజులు బకాయిలు ఉన్నాయంటూ హాల్ టికెట్‌ని విద్యార్థికి జారీ చేయకుండా ఆపడానికి వీల్లేదు. ఇప్పటికే ప్రైవేటు/కార్పొరేటు పాఠశాలలకు ఈ విషయాన్ని స్పష్టంగా చెప్పాం. హాల్ టికెట్ ఇవ్వకపోవడం వల్ల విద్యార్థి పరీక్షకు హాజరుకాకపోతే ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు బాధ్యత వహించాల్సి వస్తుంది. హాల్ టికెట్ విషయంలో ఇబ్బందులు ఏర్పడితే విద్యార్థులు విద్యాశాఖ అధికారులను సంప్రదించాలని కోరుతున్నాం. విద్యార్థులు పరీక్షలు ప్రశాంత వాతావరణంలో రాయడానికి అన్ని ఏర్పాట్లూ చేస్తున్నాం. ఏ పాఠశాలలో అయినా ఫీజు కట్టాలని హాల్ టిక్కెట్ ఇవ్వకపోతే సమాచారం ఇవ్వండి.. వెంటనే చర్యలు తీసుకుంటాం.

జిల్లాలో 137 కేంద్రాల్లో

జిల్లాలోని ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యే పది పరీక్షలకు 19 మండలాల్లో 137 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 206 ప్రైవేటు ఉన్నత పాఠశాలలు, 194 ప్రభుత్వ పాఠశాలల్లో కలిపి 29,990 విద్యార్థులకు హాల్ టికెట్లు అందాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకూ ఎంతమందికి చేరాయో, ఇంకా తీసుకోని వారి ఇబ్బందులేమిటో అనే అంశాలపై పట్టింపు, పర్యవేక్షణ లేకపోవడంతో ప్రైవేటు పాఠశాలలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు వినవస్తున్నాయి. దీంతో విద్యార్థులు నలిగిపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 30 వేల మంది విద్యార్థులుంటే వీరిలో 70 శాతం ప్రైవేటు విద్యార్థులే.తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించాలనే కోరికతో ఫీజులు కట్టలేకపోయినా ప్రైవేటు పాఠశాలలను ఆశ్రయిస్తున్నారు. ఒక్క విద్యార్థి ఏడాదిపాటు చదవాలంటే సుమారు రూ. లక్ష పైనే ఖర్చవుతుంది. దీంతో ఏడాదిలో ఫీజు రూ. లక్ష కట్టలేక విద్యార్థుల తల్లిదండ్రులు నలిగిపోతు న్నారు. చివరిలో హాల్ టిక్కెట్లకు ముడిపెట్టడంతో తప్పని పరిస్థితుల్లో అప్పు చేసి ఫీజు చెల్లించే తల్లిదండ్రులు వేలల్లో ఉన్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఇదే అదునుగా విద్యార్థులను టెన్షన్ పెట్టి మరీ ఫీజులు లాగేస్తున్నాయి..

టీడీపీ 5 జనసేన 2



నిడదవోలు నుంచే కందుల దుర్గేష్

» రాజమహేంద్రవరం లోక్‌సభ బీజేపీకే
» పురందేశ్వరి పోటీ చేసే అవకాశం
» తీరిన రూరల్ - నిడదవోలు పంచాయితీ
» శేషారావును బుజ్జగించనున్న అధిష్ఠానం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం, నిడదవోలు నియోజకవర్గంలో నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. నిడదవోలు నియోజకవర్గం ఉమ్మడి అభ్యర్థిగా జనసేన నాయకుడు కందుల దుర్గేష్ పోటీ చేయనున్నారు. తెలుగుదేశం- జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా ఆయన పేరును జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సోమవారం అధికారికంగా ప్రకటించారు. తెలుగుదేశం, జనసేన,బీజేపీ పొత్తు నేపథ్యంలో జనసేనకు జిల్లాలో రెండు అసెంబ్లీ స్థానాలు దక్కాయి. ఇప్పటికే రాజానగరం నియోజకవర్గం నుంచి బత్తుల బలరామకృష్ణను జనసేన నుంచి ఉమ్మడి అభ్యర్థిగా ప్రకటించిన సంగతి తెలిసిందే. కందుల దుర్గేష్ రాజమహేంద్రవరం రూరల్ నుంచి పోటీచేయాలని మొదటి నుంచి భావిస్తున్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ అందుకు సుముఖత వ్యక్తం చేశారు. కానీ టీడీపీ-జనసేన పొత్తుల వల్ల రూరల్ సీటు సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరికి దక్కింది.ఈ నేపథ్యంలో టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ ఆలోచించి కందుల దుర్గేష్‌ను నిడదవోలు నుంచి పోటీ చేయించడానికి తొలిజాబితా విడుదల చేసిన రోజునే నిర్ణయించారు. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి ముందుగా చెప్పిన సంగతి తెలిసిందే. రాజమహేంద్రవరం రూరల్ సీటు దక్కకపోవడంతో మొదట్లో దుర్గేష్ కొంత ఇబ్బంది పడ్డారు. రూరల్ క్యాడర్ చాలా ఒత్తిడి తెచ్చింది. నిరసనలు, ఆందోళనలు చేసింది.అధిష్ఠానం సూచనలు మేరకు దుర్గేష్ రూరల్‌లోని జనసేన క్యాడర్, తన అభిమానులకు నచ్చచెప్పారు.అదే సమయంలో గోరంట్ల బుచ్చయ్యచౌదరి తన అనుచరులతో కలిసి నేరుగా దుర్గేష్ ఆఫీసుకు వెళ్లారు. ఇద్దరూ కాసేపు ఆత్మీయంగా మాట్లాడుకున్నారు.దీంతో రూరల్‌లో సమస్య పరిష్కారమైంది. దుర్గేష్‌కు నిడదవోలు సీటును అధికారికంగా ప్రకటించారు. కానీ నిడదవోలులో రెండు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన బూరుగుపల్లి శేషారావు మళ్లీ పోటీ చేయాలని చూశారు.ఆయనతో పాటు సీనియర్ నేత కుందుల సత్యనారాయణ సీటు ఆశించారు. టీడీపీ- జనసేన అధిష్ఠానం నిర్ణయాన్ని ఇప్పటికే సీనియర్ నేత కుందుల సత్యనారాయణ స్వాగతించారు.శేషారావు అనుచరులు ఇంకా నిరాశలో ఉన్నారు. శేషారావుకు నచ్చచెప్పే బాధ్యతను టీడీపీ అధిష్ఠానం తీసుకుంది. త్వరలో కందుల దుర్గేష్ కూడా శేషారావును కలిసే అవకాశం ఉంది.

పార్టీ నిర్ణయమే శిరోధార్యం : దుర్గేష్



పార్టీ నిర్ణయం శిరోధార్యం. రూరల్ నుంచి టికెట్ ఆశించా. కానీ పొత్తులు, సమీకరణల నేపథ్యంలో నేను నిడదవోలు నుంచి పోటీ చేయాల్సి వచ్చింది. నిడదవోలు టీడీపీ నేత బూరుగుపల్లి శేషారావు సమర్థనేత, ఆయన సంపూర్ణ సహకారాన్ని కోరుతున్నాను. త్వరలోనే ఆయననునేను నేరుగా కలుస్తా. రాజమహేంద్రవరం రూరల్‌లో క్యాడర్ తననే పోటీ చేయమని పట్టుపట్టినపుడు అధిష్ఠానం నిర్ణయం చెప్పి అందరినీ ఒప్పించా. నెమ్మదిగా బయటకు వస్తున్నారు. అందరూ గోరంట్ల బుచ్చయ్యచౌదరిని గెలిపిస్తారు. నిడదవోలులో కూడా అందరినీ ఒప్పించి, మెప్పిస్తా. తనకు నిడదవోలు ప్రజలు నేతలు కొత్త కాదు. ఇప్పటికే జనసేన ఇన్‌చార్జి, ఇతర క్యాడర్ నాకు మంచి మిత్రులే. పైగా నేను గతంలో పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేసినప్పుడు అందరికీ పరిచయస్తుడినే. నిడదవోలు ప్రజలు తనను ఆశీర్వదిస్తారు. నిడదవోలు నియోజకవర్గస్థాయిలో ఓ మేనిఫెస్టోను అమలు చేస్తానని స్పష్టం చేశారు.

ఇదీ ఆయన బయోడేటా..

కందుల దుర్గేష్ ఏయూలో ఎంఏ ఎకనామిక్స్ చదివారు. జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడిగా వ్యవహరిస్తున్నారు.కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్సీగా పనిచేయడంతో పాటు రాష్ట్ర విభజన తర్వాత తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా పార్టీని బలో పేతం చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి 2014లో రాజమహేంద్రవర్గం పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేసి 21,243 ఓట్లు సాధించారు. తర్వాత జనసేనలో చేరారు. 2019లో రాజమహేంద్రవరం రూరల్ నుంచి జనసేన అభ్యర్థిగా పోటీ చేసి త్రిముఖ పోటీలో 42,685 ఓట్లు సంపాదించారు. దుర్గేష్ తాత పోతుల వీరభద్రరావు రాజమహేంద్రవరం మునిసిపల్ చైర్మన్‌గా మూడు సార్లు పనిచేశారు. 1962-67 లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా కూడా సేవలందించారు.

టీడీపీకి ఐదు సీట్లు

తెలుగుదేశం-జనసేన-బీజేపీ పొత్తు నేపథ్యంలో జిల్లాలో ఐదు అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ నేతలు పోటీ చేయనున్నారు. ఇప్పటికే ఒకటి రెండు స్థానాలు మినహా మిగతా చోట్ల అభ్యర్థులను ప్రకటించిన సంగతి తెలిసిందే. రేపోమాపో తుది జాబితా రానుంది. ఇక లోక్‌సభ స్థానాన్ని బీజేపీకి కేటాయిస్తారనే ప్రచారం జరుగుతుంది. బీజేపీ కూడా ఈ సీటును అడిగింది.బీజేపీకి ఇస్తే ఇక్కడ నుంచి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పోటీ చేసే అవకాశం ఉంది.

పనులు ప్రారంభించి నివేదిక ఇవ్వాలి
ఎన్నికల సమావేశంలో కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ త్వరలో వచ్చేస్తుంది. ఈ నేపథ్యంలో ఇటీవల క్షేత్రస్థాయిలో మంజూరైన పనులను ఆయా శాఖలకు చెందిన నోడల్ ఏజెన్సీ అధికారులు వెంటనే ప్రారంభించి నివేదికలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ డా. కె.మాధవీలత ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో సోమవారం ఎన్నికల విధులు, శాఖల వారీ మంజూరైన పనుల చేపట్టడంపై జేసీ ఎస్.తేజ్‌భరత్‌తో కలిసి కలెక్టర్ మాధవీలత అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. విధి నిర్వహణలో జవాబుదారీతనం ఉండాలన్నారు. ఎంపీ లాడ్స్, ఇతర ప్రభుత్వ శాఖల్లో ప్రతిపాదించి, ఆమోదించిన పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. ఆయా పనుల పురోగతిపై వెంటనే నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్ విషయంలో ప్రతి ఒక్కరూ కచ్చితత్వం కలిగి ఉండాలన్నారు. ఆయా శాఖల వివరాలను 24 గంటల్లోగా జిల్లా ఎన్నికల అధికారికి అందజేయాలన్నారు. ఎన్నికల కోడ్ ప్రకటించిన వెంటనే కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాలు, రాజకీయ నేతల ఫొటోలు తొలగించాలని,వివిధ కూడళ్లో ఉండే విగ్రహాలకు ముసు గులు వేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, జిల్లా అధికారులు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

17న గ్రూప్-1 పరీక్ష

రాజమహేంద్రవరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 25 పరీక్షా కేంద్రాల్లో మార్చి 17న ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ డా.కె.మాధవీలత పేర్కొన్నారు. పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహించడానికి నోడల్, రూట్ అధికారులు ముందస్తుగా ఆయా కళాశాలలు, పాఠశాలల యాజమాన్యాలు, ప్రధానోపాధ్యాయులతో సమాశమై నివేదిక అందజేయాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో నోడల్ అధికారిగా జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్ వ్యవహరిస్తున్నారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచుతామని, మహిళల తనిఖీకి ప్రత్యేక గదిని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.డీఆర్‌వో జి.నరసింహులు, పౌరసరఫరాల శాఖ డీఎం రాధిక, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు ఎం.భానుప్రకాశ్, పి.సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల భద్రత ఏర్పాట్లపై ఎస్పీ సమీక్ష

రాజమహేంద్రవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికలను సజావుగా నిర్వహించే క్రమంలో పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నామని ఎస్పీ జగదీశ్ పేర్కొన్నారు.జిల్లా పోలీసు కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా జోన్ల డీఎస్పీలు వారి పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు, ప్రాంతాలు, రిసెప్షన్ సెంటర్లు, స్ట్రాంగ్ రూమ్స్, లెక్కింపు కేంద్రాలు, పార్కింగ్ ప్రదేశాలు, రూట్ మ్యాప్, బందోబస్తు, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం, స్ట్రైకింగ్ ఫోర్స్, యాక్టివ్ రౌడీషీటర్లు, బైండోవర్లు తదితర అంశాలను పీపీటీ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఎన్నికల రోజున ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ హాల్స్, రిసెప్షన్ సెంటర్లు, పార్కింగ్, బందోబస్తుపై సూచనలు చేశారు. గత ఎన్నికల్లో నమోదైన కేసుల విషయంలో ఈ ఎన్నికల సమయంలో ఎలాంటి చర్యలు తీసుకోవాలో చెప్పారు. ప్రతి రోజూ కేంద్ర పోలీస్ దళాలతో కవాతు, ఎన్నికలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులను ఎన్నికల విధులకు ఉపయోగించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(శాంతి భద్రతలు) పి.అనిల్‌కుమార్,ఎస్‌బీ డీఎస్పీ డి.ప్రభాకర్ పాల్గొన్నారు.

మొక్కుబడి వైద్యం



అందని ఎన్‌సీడీ వైద్యం

» నీరుగారుతున్న లక్ష్యం
» పట్టించుకోని వైద్యాధికారులు
» విభాగంలో 9 మంది సిబ్బంది
» పేద రోగులపై చిన్నచూపు
» ఏదో చేసి పంపించేస్తున్న వైనం
» ఏఆర్‌టీ బాధితులకే కేన్సర్ స్క్రీనింగ్
» పనితీరులో తీవ్ర నిర్లక్ష్యం

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 11 : రాజమహేంద్రవరం జీజీహెచ్‌లోని నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) క్లినిక్‌లో వైద్యసేవలు మొక్కుబడిగా సాగుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. ఎన్‌సీడీ క్లినిక్‌లో వైద్యసేవలు సక్రమంగా అందుతున్నాయా, డాక్టర్, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా, రోగులు వైద్య సేవలు ఉపయోగించుకుంటున్నారా లేదా అనే విషయాలపై అటు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారుల పర్యవేక్షణ, తనిఖీలు లేకపోవడం, జీజీహెచ్ అధికారులు మనకెందుకులే అనే ధోరణి ప్రదర్శించడంతో ఎన్‌సీడీ క్లినిక్ ఆశించిన ప్రయోజనం పూర్తిస్థాయిలో దక్కడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక్కడ ప్రతి రోజూ ఎంత మంది రోగులు వైద్యసేవలు వినియోగించుకుంటున్నారనే విషయంలో వైద్యాధికారులు, వైద్యులు గోప్యత పాటిస్తున్నారు. వివరాలు కోరినా చెప్పడానికి నిరాకరిస్తున్నారు. దీంతో అసలు ఎన్‌సీడీ వైద్యసేవలు ఎవరికి, ఎందుకు అనేదానిపై చర్చ సాగుతోంది. కేంద్ర ప్రభుత్వం నేషనల్ హెల్త్‌మిషన్‌లో భాగంగా నిర్వహిస్తున్న ఎన్‌సీడీ ప్రాజెక్టు ద్వారా అందించే వైద్యసేవలపై అవగాహన లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.

బీపీ, షుగర్ టెస్టులు రాయడం ...

ఎన్‌సీడీ క్లినిక్ (దీర్ఘకాలిక వ్యాధుల ఓపీడీ)ల ప్రధాన లక్ష్యం డయాబెటిస్, హృదయసంబంధ వ్యాధులు, స్ట్రోక్, కేన్సర్ వంటి వాటిపై నిశితమైన దృష్టిపెట్టాల్సి ఉంటుంది. వీటిని ముందుగానే గుర్తించడం, చికిత్స, ఫాలో అప్ కచ్చితంగా జరగాల్సి ఉంది. కానీ జీజీహెచ్‌లోని ఎన్‌సీడీ క్లినిక్‌లో ఓపీ సేవలు మొక్కుబడిగా మాత్రమే అందుతున్నాయి. వైద్యుడు రోగులకు బీపీ చూడడం, షుగర్ టెస్టులు రాయడం, మందులు రాసివ్వడం వంటి నామమాత్ర వైద్యమే చేసి పంపిస్తున్నారు. ఎన్‌సీడీ లక్ష్యాలకు అనుగుణంగా రోగానికి సంబంధించిన పూర్తి ప్రొఫైల్ క్లినిక్‌లో పక్కాగా రికార్డు చేయడంలేదనే ఆరోపణలున్నాయి. ఇక్కడ ఒక వైద్యుడు, ఏడుగురు స్టాఫ్‌నర్సులు, ఒక ల్యాబ్ టెక్నీషియన్ ఉన్నారు. దీర్ఘకాలిక వ్యాధుల ఓపీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ అంటే కేవలం మూడు గంటలు మాత్రమే ఉంటుంది. చాలాసార్లు వైద్యుడు అందుబాటులో ఉండడంలేదనే ఫిర్యాదులున్నాయి. ఈ మాత్రం వైద్యసేవలు జీజీహెచ్‌లోని సాధారణ ఓపీలోనూ లభిస్తుండడం గమనార్హం. జీజీహెచ్‌లోని జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీతో సహా జనరల్ ఫిజీషియన్లు అంతా ప్రతిరోజూ ఈ తరహా రోగాలకు వైద్యసేవలందిస్తున్నారు.ఇలాంటి పరిస్థితుల్లో ఎన్‌సీడీ క్లినిక్ ప్రత్యేకత, లక్ష్యం ఏమిటి ? అసలు దాని అవసరం ఏమిటనేదనేది ప్రశ్నార్థకంగా మారింది.



బ్రెస్ట్ కేన్సర్ సంబంధిత స్క్రీనింగ్ పరికరం

ఏఆర్‌టీ బాధితులకే కేన్సర్ స్క్రీనింగ్

ఎన్‌పీసీడీసీఎస్‌లో భాగంగా ఎన్‌సీడీ క్లినిక్‌కు అనుసంధానంగా కేన్సర్ స్క్రీనింగ్ యూనిట్ ఏర్పాటు చేశారు. షేర్ ఇండియా అనే సంస్థతో ఒప్పందం చేసుకుని బ్రెస్ట్, సర్వికల్ స్క్రీనింగ్ పరికరాలు అందుబాటులో ఉంచారు. అయితే ఇక్కడ కేవలం ఏఆర్‌టీ బాధిత మహిళలకే (హెచ్‌ఐవీ/ఎయిడ్స్) స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. సర్వికల్, బ్రెస్ట్ కేన్సర్‌కు సంబంధించిన స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి తుది రిపోర్టులు కాకినాడ పంపిస్తున్నారు. కేన్సర్ యూనిట్‌కు సంబంధించి ల్యాబ్, ఇతర సౌకర్యాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు కాలేదు. దీంతో ఈ ప్రక్రియ కూడా మొక్కుబడిగానే సాగుతోంది.

ఎన్‌సీడీ క్లినిక్ అంటే ..

నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ)నే దీర్ఘకాలిక వ్యాధులుగా పిలుస్తుంటారు. హృదయ సంబంధ వ్యాధులు, కేన్సర్, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు, మధుమేహం తదితర ప్రధాన ఎన్‌సీడీలను నివారించడానికి, నియంత్రించడానికి నేషనల్ ప్రోగ్రాం ఫర్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఆఫ్ కేన్సర్, డయాబెటిస్, కార్డియో వాస్క్యులర్ డిసీజెస్, స్ట్రోక్ (ఎన్‌పీసీడీసీఎస్) ప్రోగ్రాంను 2010లో ప్రారంభించారు. ఇందులో భాగంగా మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, మానవ వనరులు అభివృద్ధి, హెల్త్ ప్రమోషన్, ముందస్తు నిర్ధారణ, నిర్వహణ, రిఫరల్ ప్రధాన లక్ష్యాలుగా నిర్దేశించుకున్నారు. ఎన్‌సీడీల్లో ముందస్తు రోగనిర్ధారణ, చికిత్స, ఫాలో అప్ కోసం సేవలను అందించాల్సి ఉంది. ఎన్‌సీడీ క్లినిక్‌లకు హాజరయ్యే రోగులకు ఉచిత రోగ నిర్ధారణ సౌకర్యాలు, మందులు అందించాలి. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఈ ప్రక్రియ ఎన్‌సీడీ క్లినిక్‌ల్లో సక్రమంగా జరగడంలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.




ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ మాధవీలత

స్పందనలో 152 అర్జీలు స్వీకరణ

రాజమహేంద్రవరం సిటీ/రూరల్ మార్చి 11: స్పందన సమస్యలను తక్షణం పరిష్కరించాలని కలెక్టర్ మాధవీలత అన్నారు. రాజమహేంద్రవరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన జిల్లా స్థాయి స్పందన కార్యక్రమంలో కలెక్టర్, జేసీ తేజ్ భరత్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జిల్లా నలుమూలల నుంచి 152 మంది బాధితులు వచ్చి తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కుటీర పరిశ్రమ పెడతామంటే తమకు బ్యాంక్ రుణం ఇవ్వడంలేదని నిడదవోలు తిరుగూడెంకు చెందిన కృష్ణ, ఐదుగురు దివ్యాంగులు వాపోయారు. కాతేరు గ్రామానికి చెందిన బగుడు కృష్ణవేణి పాల ప్యాకెట్లు అమ్ముకుని జీవనం సాగిస్తున్నానని.. నా భర్త బడుగురెడ్డి మరణించాడని.. మాకు 24 ఏళ్ళ కుమారుడు రాజేష్ ఉన్నాడని.. తన ఇంటికి నా భర్త అన్నయ్య బడుగు ప్రసాదరావు వచ్చి ఇంటికి ఆక్రమించుకుని ఇబ్బందులు పెడుతున్నాడని న్యాయం చేయాలని వేడుకుంది. ద్వారాకా తిరుమలకు చెందిన గద్దె సత్యవతి తన ఆస్తిని తన కొడుకు, కుమార్తె తనకు తెలియకుండా వేరే వారికి అమ్మేశారని.. న్యాయం చేయాలని వేడుకుంది. రాజమహేంద్రవరం 49వ డివిజన్‌కు చెందిన మాసా రామ్‌జోగ్ క్వారీ గోతిలో పడి మృతిచెందిన తుమ్మల లోవరాజు మృతికి కారకుడైన క్వారీ ఓనర్ పై కేసు నమోదు చేయాలని ఆ ప్రాంత ప్రజలకు రక్షణకు చర్యలు చేపట్టాని కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఆయా అర్జీలను పరిశీలించిన కలెక్టర్ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

గోదావరి తీరంలో అక్రమ కట్టడాలు ఆపాలని వినతి



కొవ్వూరు, మార్చి 11 : కొవ్వూరు గోదావరి తీర ప్రాంతంలో చేపడుతున్న అనదికార కట్టడాలను వెంటనే తొలగించాలని గోవు గౌతమి గోదావరి పరిరక్షణ సమితి సభ్యులు ఫిర్యాదు చేశారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డివిజనల్ స్పందనలో 6 ఫిర్యాదులను స్వీకరించారు. గోవు గౌతమి గోదావరి పరిరక్షణ సమితి సభ్యుడు వై.కె.శ్రీనివాస్, గంధం బాబ్జి మాట్లాడుతూ కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో గీతా మందిరం ఎదురుగా, గోదావరిమాత విగ్రహం వద్ద గోదావరి బండ్ పార్క్ లో చర్చి నిర్వాహకులు పార్క్‌ను ఆక్రమించి శాశ్వత కట్టడాలను నిర్మిస్తున్నారని నిలుపుదల చేయాలని మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారికి తెలియజేసినా పట్టించుకోవడం లేదన్నారు. తక్షణం ఆక్రమణలను తొలగించి, సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ ఏవో కె. రవి విక్రమ్ పాల్గొన్నారు.

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోండి



చాగల్లులో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

చాగల్లు, మార్చి 11: ప్రతి పౌరుడు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సీఐ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండలంలోని చాగల్లు, ఊనగట్ల, చిక్కాల, కలవలపల్లి, బ్రాహ్మణగూడెం, మార్కొండపాడు గ్రామాల్లో కేంద్ర బలగాలతో పోలీసు కవాతు నిర్వహించారు. సీఐ జెండా ఊపి కవాతును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యమని, ప్రజల్లో భయాందోళనలు లేకుండా ఓటు హక్కు వినియోగించుకొనేలా నమ్మకం కలిగించేందుకు ఈ కవాతు నిర్వహించామన్నారు. ఎవరైనా ప్రలోభ పెట్టినా, భయాందోళనలకు గురిచేసినా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని చెప్పారు. కవాతులో ఎస్ఐ పి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మాట తప్పి మడమ తిప్పిన జగన్

టీడీపీ కొవ్వూరు ద్విసభ్య కమిటీ

కొవ్వూరు, మార్చి 11: మద్య నిషేధం చేసిన తర్వాతే ఓటు అడుగుతానని చెప్పి జగన్ మాట తప్పి మడమ తిప్పాడని టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి విమర్శించారు. సోమవారం కొవ్వూరులోని పార్టీ కార్యాలయంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ లక్షల కోట్ల కమీషన్ కోసం నాసిరకం మద్యం విక్రయించి 35 లక్షల జీవితాలు నాశనం చేశాడన్నారు. అధికారంలోకి వచ్చిన వారంలో సీపీఎస్ రద్దు చేస్తానని, 3 లక్షల ఉద్యోగాలు భర్తీచేస్తానని మాట తప్పాడన్నారు. విద్యుత్ చార్జీలు పెంచనని చెప్పి 9 సార్లు పెంచి రూ.64 వేల కోట్లు ప్రజలపై భారం మోపారన్నారు. ఉచిత ఇసుకను రద్దుచేసి రూ.50 వేల కోట్లు కుంభకోణానికి పాల్పడ్డాడన్నారు. రైతుభరోసా కింద రూ.12500 ఇస్తానని చెప్పి రూ.7500 మాత్రమే ఇచ్చాడన్నారు. కేంద్రం ఇస్తున్న నిదులను తనవిగా చూపించుకుంటున్నారన్నారు. సిద్ధ సభల పేరుతో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ద్విసభ్య కమిటీ విమర్శించింది.

కొవ్వూరు ఆర్‌ఆర్ బ్రిడ్జిపై గడ్డర్ ఏర్పాటు

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జిపై గడ్డర్ ఏర్పాటు చేసిన దృశ్యం

కొవ్వూరు, మార్చి 11: కొవ్వూరు రాజమహేంద్రవరం మధ్య గోదావరిపై ఉన్న రోడ్డు కం రైలు బ్రిడ్జిపై భారీ వాహనాలు రాకపోకలను నిషేదిస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గడ్డర్లు ఏర్పాటుచేశారు. ఇటీవల కొంతమంది గడ్డరు తొలగించి రాత్రుళ్ల భారీ వాహనాలతో వంతెనపై రాకపోకలు సాగిస్తున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో రోడ్డు కం రైలు బ్రిడ్జిపై ప్రజారవాణాకు అంతరాయం కలిగించి భారీ వాహనాలకు దారిచ్చారు అని ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రాజమహేంద్రవరం వైపు తీసేసిన గడ్డర్‌ను సోమవారం ఎస్పీ పి.జగదీశ్ ఆదేశాలతో రాజమహేంద్రవరం టూటౌన్ సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అధికారులు బిగించారు. భారీ వాహనాలు వెళ్లకుండా చర్యలు చేపట్టారు.

సుందరేశ్వరస్వామి ఆదాయం రూ.79,663

కొవ్వూరు, మార్చి 11: సుందరేశ్వరస్వామి ఆలయ శివరాత్రి ఆదాయం రూ.79,663 వచ్చినట్టు దేవదాయశాఖ తాడేపలిగూడెం ఇన్‌స్పెక్టర్ ఎ.సుజనకుమార్ తెలిపారు. కొవ్వూరు గోష్పదక్షేత్రంలోని సుందరేశ్వరస్వామి ఆలయ హుండీని సోమవారం లెక్కించారు. కార్యక్రమంలో ఆలయార్చకులు మానేపల్లి శ్రీనివాసశాస్త్రి, సుందర గణేష్, భక్తులు పాల్గొన్నారు.

ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టర్ల ఆవిష్కరణ

తాళ్లపూడి, మార్చి 11:ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ఇంటిపై ఓట్ ఫర్ ఓపీఎస్ స్టిక్కర్లను అంటించుకుని, సీపీఎస్‌ను రద్దు చేసే పార్టీకే తమ ఓటు అని అన్ని పార్టీలకు తెలియజెప్పాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జోడాల వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టర్లు, స్టిక్కర్లను ఆయన ఆవిష్కరించారు. సచివాలయ ఉద్యోగుల జేఏసీ సభ్యుడు గెడ్డం గణేష్ మాట్లాడుతూ పాత పెన్షన్ అమలులో ఉన్న రాష్ట్రాలకు లేని ఇబ్బంది మన రాష్ట్రానికి ఎందుకన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థిని మృతికి సంతాపం



యర్నగూడెంలో శాంతిర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

దేవరపల్లి, మార్చి 11: వీరంపాలెంలో శివరాత్రి ఉత్సవాల్లో అపశృతి జరగడంతో మృతిచెందిన త్యాజంపూడి గ్రామానికి చెందిన 9వ తరగతి విద్యార్థిని దాసరి పుష్పకు సహచర విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర సంతాపం తెలిపారు. సోమవారం యర్నగూడెంలో జడ్పీ హైస్కూల్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు శాంతి ర్యాలీ జరిపి మానవహారం నిర్వహించారు. అనంతర నివాళులర్పించారు. ప్లకార్డులు చేతపట్టి అర్థం లేని ఆచారాలతో ప్రాణాలతో చెలగాటం ఆడొద్దని, మూఢనమ్మకాలు విడిచి పెడదాం.. తోటి వారి ప్రాణాలు కాపాడుదాం. బాణసంచా కాల్చవద్దు అంటూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉబా చంద్రరావు, గ్రంథాలయాభివృద్ధి కమిటీ చైర్మన్ రవీంద్ర, ఉపాధ్యాయులు సుధారాణి, స్వర్ణలత, సురేష్‌బాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ

చాగల్లు, మార్చి 11: రోటరీ క్లబ్ నిడదవోలు వారి ఆధ్వర్యంలో మండలంలోని బ్రాహ్మణగూడెం ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్సిళ్లు, పలకలు తదితర ఉపకరణాలు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులకు బోధన ఉపకరణాలను అందజేశారు. ఎన్ఆర్ఐలు గొన్నాబత్తుల నందకిషోర్, భాగ్యలక్ష్మి దంపతుల ఆర్థిక సహకారంతో జరిగిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, గుంటుపల్లి శివకుమార్, కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చిన్నాయిగూడెం సొసైటీ మహాజన సభ



సభలో ప్రసంగిస్తున్న సొసైటీ అధ్యక్షుడు జగదీష్

దేవరపల్లి, మార్చి 11: సొసైటీ అభివృద్ధికి రైతులు, ఉద్యోగుల కృషి అభినందనీయమని చిన్నాయి గూడెం సొసైటీ అధ్యక్షుడు గడా జగదీష్ అన్నారు. మండ లంలోని చిన్నాయిగూడెం సొసైటీ మహాజన సభ ఆయన అధ్యక్షతన సోమవా రం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ సొసైటీలో ప్రస్తుతం రూ.13.60 కోట్ల డిపాజిట్లు ఉన్నాయని, రుణాలు రూ.17.42 కోట్ల ఇచ్చామన్నారు. చిన్నాయి గూడెం, యాదవోలులో సొసైటీ ద్వారా కంజ్యూమర్ పెట్రోల్ బంకు ఏర్పాటు చేశామని, అలాగే చిన్నాయిగూడెంలోలో జనరిక్ మెడికల్ షాపు, వాటర్‌ప్లాంటు, ఎరువులు, పురుగు మందులు, సరసమైన ధరలకు రైతులకు అందజేస్తున్నామన్నారు. బడ్జెట్‌ను సొసైటీ కార్యదర్శి పసుపులేటి నారాయణరాజు ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో డైరెక్టర్లు దానం అబ్బులు, పొతులూరి వెంకటరత్నం, నాయకులు అరేటి సూర్యనారాయణ, గంగరాజు, సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

15న సైబర్ నేరాలపై

దేవరపల్లిలో అవగాహన సదస్సు

దేవరపల్లి, మార్చి 11: సైబర్ నేరాలపై దేవరపల్లిలో అవగాహన సదస్సు ఈ నెల 15న నిర్వహించనున్నట్టు అసరా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లాజరస్ తెలిపారు. గ్రామంలో సైబర్ నేరాల పోస్టర్‌ను సోమవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరల్డ్ కంజ్యూమర్స్‌డే సందర్భంగా స్థానిక చైతన్య స్కూల్ ఎదురుగా ఈ అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో అనధికార నిర్మాణాలు

- అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు
- ఇన్‌చార్జిలకు ఇచ్చే గౌరవం కౌన్సిలర్లకు ఇవ్వడం లేదు
- కొవ్వూరు కౌన్సిల్ అత్యవసర సమావేశంలో కౌన్సిలర్ల ఆగ్రహం
- నిధుల కేటాయింపులో వివక్ష: కౌన్సిలర్ రామారావు

కొవ్వూరు, మార్చి 11: పట్టణంలో ప్రభుత్వ స్థలాల్లో అనధికార నిర్మాణాలు యథేచ్ఛగా జరుగుతున్నాయని టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంపై కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. బీజేపీ కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ మాట్లాడుతూ గోష్పదక్షేత్రంలోను, గోదావరి బండ్‌పై అనధికారికంగా శాశ్వత భవనాల నిర్మాణం జరుగుతోందని, నిలుపుదల చేయాలని టౌన్‌ప్లానింగ్, మున్సిపల్ కమిషనర్లకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. నిర్మాణాలు ఎవరి ప్రోద్బలంతో జరుగుతున్నాయని, ప్రశ్నించారు. తక్షణం తొలగించాలన్నారు. టీపీవో శ్రీధర్ మాట్లాడుతూ వరుసగా 3 రోజులు సెలవులు రావడంతో నిర్మాణాలను అడ్డుకోలేకపోయామని, వెంటనే తొలగింపు చర్యలు తీసుకుంటామన్నారు. కండెల్లి రామారావు మాట్లాడుతూ రోడ్డు కం రైలు బ్రిడ్జి టోల్‌గేట్ వద్ద రోడ్డు పక్కన పెద్ద పెద్ద రేకులషెడ్లు వేసి కాంక్రీట్‌తో నిర్మాణాలు చేపట్టారన్నారు. టీడీపీ ఫ్లోర్‌లీడర్ సూరపనేని చిన్ని మాట్లాడుతూ వరుస సెలవులు వచ్చాయని అక్రమ కట్టడాలను అడ్డుకోలేక పోయామని చెప్పడం సరికాదన్నారు. అక్రమ నిర్మాణాలపై గతంలో అనేకసార్లు సభ దృష్టికి తీసుకొచ్చామని, కౌన్సిలర్లతో కమిటీ కూడా వేశారన్నారు. పట్టణంలో మెయిన్‌రోడ్, రైట్ బికెన్ రోడ్డు పూర్తిగా మరమ్మతులకు గురయ్యాయని, కాంట్రాక్టర్‌ను పిలిచి మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. కంటమణి రమేష్‌బాబు మాట్లాడుతూ గోష్పదక్షేత్రంలో అక్రమ నిర్మాణాలపై 2,3 నెలలుగా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కండెల్లి రామారావు మాట్లాడుతూ గడప గడపకు కార్యక్రమంలో చేపట్టిన పనుల్లో ఔరంగాబాద్‌కు కేవలం రూ.3.50 లక్షలు కేటాయించి తనపై వివక్ష చూపుతున్నారన్నారు. పనులు అజెండాలోకి తీసుకువచ్చే ముందు కౌన్సిలర్‌ను సంప్రదిస్తే అత్యవసర పనులను సూచిస్తామన్నారు. బొండాడ సత్యనారాయణ మాట్లాడుతూ వైసీపీ వార్డు ఇన్‌చార్జులకు ఇస్తున్న గుర్తింపు, టీడీపీ కౌన్సిలర్లకు ఇవ్వడం లేదన్నారు. కౌన్సిలర్ల పట్ల ప్రొటోకాల్ పాటించడం లేదన్నారు. ఎన్నికల కోడ్ వస్తుందని అభివృద్ధి పనులకు హడావుడిగా కొబ్బరికాయలు కొడుతున్నారన్నారు. సూరపనేని చిన్ని మాట్లాడుతూ కొవ్వూరు ఎమ్మెల్యే తానేటి వనిత అని, తలారి వెంకట్రావు కాదని, ఆయన కొవ్వూరు నియోజకవర్గానికి వైసీపీ నియమించిన ఇన్‌చార్జి మాత్రమేనన్నారు. ఇప్పటివరకు గడప గడపకు కార్యక్రమంలో 82 పనులు చేపట్టి, 15 పనులు పూర్తిచేశారని, నాలుగు రోజుల్లో ఎన్నికల కోడ్ వస్తుంది మిగిలిన పనులు ఎప్పుడు చేస్తారని అధికారులను ప్రశ్నించారు. మార్కెట్ ఆశీల పాటకు సంబంధించి కౌన్సిల్ అజెండాలోకి తీసుకురాకుండా చైర్‌పర్సన్‌తో ర్యాటిఫికేషన్ చేయించడంపై తీవ్ర అభ్యంతరం తెలిపారు. చీర అరుణ మాట్లాడుతూ బ్రిడ్జిపేటకు వచ్చే తాగునీటి పైపులైను లీకులను అరికట్టాలన్నారు. చైర్‌పర్సన్ రత్నకుమారి మాట్లాడుతూ సమావేశంలో సభ్యులు సభామర్యాదను పాటించాలని, అజెండా చదువుతున్నప్పుడు ఎవ్వరికి వారు కబుర్లు చెప్పుకోవడంపై అభ్యంతరం వ్యక్తంచేశారు. రహదారి మరమ్మతులు, తాగునీటి పైపులైను లీక్‌లను అరికట్టాలని అధికారులకు సూచించారు.



చైర్‌పర్సన్ రత్నకుమారి, సమావేశంలో పాల్గొన్న మున్సిపల్ కౌన్సిలర్లు

డ్వాక్రా మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలి

- మంత్రి వనిత.. నల్లజర్లలో 'చేయూత' నిధుల అందజేత

నల్లజర్ల/దేవరపల్లి, మార్చి 11: డ్వాక్రా మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. సోమవారం నల్లజర్ల హైస్కూల్లో డ్వాక్రా మహిళలకు చేయూత నిధులను అందించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ మహిళలు భర్తల సంపాదనపై ఆధారపడకుండా తమ సంపాదన తామే సంపాదించుకునే స్థితికి చేరాలన్నారు. సమాజంలో గౌరవ ప్రతిష్టలు పెరిగేలా దృష్టి పెట్టాలన్నారు. అలాగే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్మించిన అదనపు ఆరు పడకల వార్డు భవనాన్ని హోం మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ బంకా జయలక్ష్మి, సర్పంచ్ పల్లి జ్యోతి, డాక్టర్ గంగాధర్, కారుమంచి రమేష్, బంకా అప్పారావు, జీవీవీ ప్రసాద్, చెల్లు హరిబాబు పాల్గొన్నారు. దేవరపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద వైఎస్సార్ చేయూత కార్యక్రమంలో మంత్రి వనిత పాల్గొన్నారు. అలాగే జగనన్న ఇళ్ల స్థలాల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. సోమవారం సాయంత్రం రూ.1.49 కోట్లతో చేపట్టనున్న యర్నగూడెం-పోతవరం బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో గూడూరి శ్రీనివాస్, ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఏఎంసీ చైర్మన్ జనార్దనరావు, కూచిపూడి సతీష్, రాజేంద్రబాబు పాల్గొన్నారు.

చాగల్లు: చాగల్లులోని శ్రీకృష్ణదేవరాయ కల్యాణ మండపం ప్రాంగణంలో జరిగిన వైఎస్ఆర్ చేయూత కార్యక్రమం ఎన్నికల ప్రచారాన్ని తలపించేలా జరిగింది. ఎమ్మెల్యే తలారి వెంకటరావు, గూడూరి శ్రీనివాసరావు సహా మాట్లాడిన వారందరు ప్రస్తుతం అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలు, నవరత్నాలు సహా మీ బ్యాంకు ఖాతాల్లో ఎన్నడు లేనివిధంగా డబ్బులు బటన్ నొక్కి వేయాలంటే మీ రెండు ఓట్లు వైసీపీకే వేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సహా మాట్లాడిన వారు ఇదే తరహాలో మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముందు ఊనగట్లలో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే తలారి ప్రారంభించారు.



నల్లజర్లలో అదనపు పడకల వార్డు భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి వనిత

వేగేశ్వరపురంలో రెండు గంటలు ఆలస్యంగా..

సభ నుంచి వెనుదిరిగి వెళ్లిపోయిన మహిళలు



సభ ఆలస్యం కావడంతో ఇంటికి వెళ్లిపోతున్న మహిళలు

తాళ్లపూడి, మార్చి 11 మండలంలోని వేగేశ్వరపురంలో డీవీవీ దానయ్య ఎస్టేట్ ప్రాంగణంలో నిర్వహించిన వైఎస్ఆర్ చేయూత చెక్కుల పంపిణీ కార్యక్రమం సుమారు రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభమైంది. దీంతో సభకు వచ్చిన మహిళల్లో కొందరు వెనుదిరిగి వెళ్లిపోయారు. ఇదీగాక గతంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఖాళీ కుర్చీల ఫొటోలు పత్రికల్లో రావడంతో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సరిపడా కుర్చీలు తెప్పించారు. అయితే కొందరు వాలంటీర్లు ఈ కార్యక్రమంలో కొత్త వారికి ఇళ్ల పట్టాలు కూడా ఇస్తారని తెలుపడంతో మహిళలు అధిక సంఖ్యలో విచ్చేశారు. కూర్చోవడానికి కుర్చీలు కూడా లేకపోవడంతో వచ్చిన వారు వచ్చినట్టే వెళ్లిపోయారు. కాగా కార్యక్రమానికి వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు, ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్ విచ్చేసి చేయూత పథకం కింద మండలంలోని 2566 మంది మహిళలకు రూ.4.81 కోట్ల చేయూత నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ పోసిన శ్రీలేఖ, ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు గూడా విజయరాజు, ఐకేపీ ఏపీఎం రోజ్ మాణిక్యం, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ఓటుందా.. చీర తీసుకో!

రాజమహేంద్రవరంలో వైసీపీ ప్రలోభాల వల

రాజమహేంద్రవరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రలోభాల చీరల పంపిణీ తంతు కొనసాగుతూనే ఉంది. ఎన్నికల వేళ తాయిలాలను ఇంటికి వెళ్లి మరీ చేతిలో పెడుతున్నారు. సోమవారం నారాయణపురం, సీతంపేట, లలితానగర్ తదితర చోట్ల ప్రలోభాల పంపిణీ జరిగింది. ఐదారుగురు వైసీపీ కార్యకర్తల బ్యాచ్‌కి వలంటీరు, సచివాలయ సిబ్బందిని జతకలిపి వీధుల్లోకి పంపుతున్నారు. ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్, ఓటరు లిస్టులో పేరు చెక్ చేసి చీరను అందజేస్తున్నారు. సోమవారం నారాయణపురంలో చీరలు ఇస్తున్న సమయంలో ఒకామె ఓటును ఎగరగొట్టేశారనే విషయం తెలిసింది. దీంతో సచివాలయానికి వెళ్లాలని చీరల పంపిణీ బృందం ఆమెకు ఉచిత సలహా ఇచ్చింది. తన ప్రమేయం లేకుండా ఓటు ఎలా తొలగించారనే ప్రశ్నకు సమాధానం కరువైంది. పైగా చీరల పంపిణీ బృందం వద్ద ట్యాబ్ ఉంటోంది. ఆ ట్యాబ్‌లో కూడా ఓటును, డోర్ నెంబరును సరి చూసుకుంటున్నారు. కచ్చితంగా అవి సరిపోలితేనే చీర ఇస్తున్నారు. ఓటు లేని లేదా సాంకేతిక ఇబ్బందులు ఉన్నా, ఓటరు లిస్టులో పేరు లేకపోయినా చీర ఇవ్వడం లేదు. పంపిణీ చేయడానికి జిల్లాకు లక్షల సంఖ్యలో చీరలు వచ్చినట్టు సమాచారం. ఆయా ప్రాంతాల నాయకుల కనుసన్నల్లో తంతు నడుస్తోంది.



రాజమహేంద్రవరంలో చీరలు పంచుతున్న దృశ్యం

జగన్ వల్లే మేలు జరిగిందనడం సరికాదు

కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాంబాబు

పెరవలి, మార్చి 11: సీఎం జగన్మోహనరెడ్డి వల్ల దళితులు గౌరవంగా బ్రతుకుతున్నారని హోమ్ మంత్రి తానేటి వనిత పేర్కొనడం విడ్డూరమని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు జువ్వల రాంబాబు విమర్శించారు. కానూరులో ఆదివారం రాత్రి వైసీపీ ఆధ్వర్యంలోదళిత సభ నిర్వహించారని ఈ సందర్భంగా హాజరైన వనిత మాట్లాడుతూ సీఎం జగన్ వల్లే దళితులకు మేలు జరిగినట్టు చెప్పడం సరికాదని, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ వల్లే దళితులు గిరిజనులు, మైనర్లు ప్రస్తుతం ఆత్మగౌరవంతో తలెత్తుకుని జీవిస్తున్నారని ఈ విషయాన్ని మంత్రి గ్రహించాలన్నారు. సీఎం తర్వాత రెండో స్థానంలో ఉన్న మంత్రి వనిత కులాల వారీగా విడదీసి మాట్లాడడం తగదన్నారు. ఈ విధంగా బానిసత్వ వ్యాఖ్యలు చేయడానికి దళితల ఆత్మగౌరవాన్ని తాకట్టుపెడుతున్నారని రాంబాబు విమర్శించారు. రాష్ట్రంలో అంబేడ్కర్ విదేశీ విద్యాపథకం పేరు రద్దు చేసి జగన్ ఆయన పేరు పెట్టుకున్నారని ఇది ఏ విధంగా సమర్థనీయమన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ నిధులు దళితుల అభివృద్ధికి మాత్రమే ఖర్చు చేయాల్సి ఉండగా నవరత్నాలు ప్రకటించి దళితులకు అన్యాయం చేశారన్నారు.

కె.సావరంలో నేత్ర వైద్యశిబిరం

ఉండ్రాజవరం, మార్చి 11: మండలంలోని కె.సావరం గ్రామంలో తణుకు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్రశాల వైద్యులు సుమారు 110మంది రోగులకు వైద్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. క్యాటరాక్ట్ ఆపరేషన్లు చేయడానికి కొంతమందిని ఎంపిక చేసినట్టు ఎన్ఎస్ఎస్ పీవో ఐవీ నారాయణ తెలిపారు. అనంతరం జరిగిన సమావేశంలో పలువురు ప్లాస్టిక్ వాడకం ఆపాలని, ఇళ్ల వద్ద మొక్కలు పెంచాలని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ నార్ని రామకృష్ణ, కోస్టల్ ఆగ్రో ఫ్యాక్టరీ అధినేత చిలుకూరి రామకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోదావరిలో మృతదేహం లభ్యం

కొవ్వూరు, మార్చి 11: కొవ్వూరులోని 16వ వార్డు ఔరంగాబాద్‌లో గోదావరి నదిలో మగ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. నిడదవోలు మండలం సుబ్బరాజుపేటకు చెందిన నాగిరెడ్డి సత్యనారాయణ(58) శివరాత్రి సందర్భంగా కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో గోదావరి నదిలో పుణ్యస్నానం ఆచరించడానికి వచ్చి తిరిగి ఇంటికి వెళ్లలేదు. దీంతో కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం ఔరంగాబాద్ వద్ద గోదావరిలో మృతదేహం కనిపించడంతో మృతుడి కుమారుడు కోటేశ్వరరావు తన తండ్రి సత్యనారాయణగా గుర్తించి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

గుంటూరు తరలిన పొగాకు రైతులు

దేవరపల్లి, మార్చి 11: ఇండియన్ టొబాకో నూతన అధ్యక్షుడిగా గుంటూరుకు చెందిన పోలిశెట్టి శ్యామ్‌సుందర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శ్యామ్‌సుందర్‌ను దేవరపల్లి మండల పొగాకు రైతు సంఘంనాయకులు సోమవారం గుంటూరులో కలిసి అభినందనలు తెలియజేశారు. ఇండియన్ టొబాకో అసోసియేషన్ ఎంతో ప్రతిష్ఠాత్మకమైందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కరుటూరి శ్రీనివాస్, కాట్రు సత్యనారాయణ, సుంకవల్లి రాము, కుసులూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

కొవ్వూరు, మార్చి 11: వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ చంద్రాల బాబూరావు తెలిపారు. రాజమహేంద్రవరం దేవిచౌక్‌కు చెందిన బత్తుల రామారావు రేషన్ డీలర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 10న సోదరుడి వద్ద రూ.50 వేలు తీసుకుని వెళ్లి రాత్రి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకడం ప్రారంభించారు. సోమవారం మధ్యాహ్నం రోడ్డు కం రైలు బ్రిడ్జిపై 136వ స్తంభం వద్ద రామారావు బైక్, చెప్పులు కనిపించాయి. దీంతో రామారావు సోదరుడు వెంకటరమణమూర్తి కొవ్వూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ తెలిపారు.

రెండు మోటారు సైకిళ్లు ఢీ

ఒకరి మృతి.. ముగ్గురికి తీవ్రగాయాలు



అనపర్తిలో ప్రథమ చికిత్స పొందుతున్న యువకుడు

అనపర్తి, మార్చి 11: అనపర్తి మండలం లక్ష్మీనరసాపురం వంతెన వద్ద సోమవారం రెండు బైకులు ఢీకొని నలుగురు వ్యక్తులు తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. లక్ష్మీనరసాపురం కెనాల్ రోడ్డులో రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనడంతో ఒక బైక్‌పై ప్రయాణిస్తున్న మండపేటకు చెందిన ఇళ్ల సూర్యసాయిరామ్, ఇప్పనపాడుకు చెందిన గొరసా సాయిచంద్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం తరలించారు. మరో బైక్‌పై ప్రయాణిస్తున్న మండపేటకు చెందిన కొమ్మిశెట్టి వెంకటేష్(29), సత్తిబాబు సోదరులు పెద్దాపురం పనికి వెళ్లి పని ముగించుకుని తిరుగు ప్రయాణంలో ప్రమాదానికి గురయ్యారు. వీరిని రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించగా వెంకటేష్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామారావు తెలిపారు.

లక్ పతి దీదీ రుణాల అందజేత



లబ్ధిదారులకు నమూనా చెక్ అందజేస్తున్న కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం రూరల్, మార్చి 11: లక్ పతి దీదీ పథకం ద్వారా జిల్లాలో 21 స్వయం సహాయక సంఘాలకు రూ.30 లక్షల రుణాలను, 1188 స్వయం సహాయక సంఘాలకు రుణాల కింద రూ.113 కోట్లు బ్యాంక్ లింకేజీ ద్వారా రుణాలు అందజేసినట్టు జిల్లా కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. స్కిల్ ట్రైనింగ్‌లో భాగంగా ఏల్ఈడీ బల్బులు, ప్లంబింగ్, డ్రోన్ రిపెయిరింగ్ తదితర టెక్నికల్ స్కిల్స్ నేర్పిస్తారన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్, డీఆర్వో నరశింహులు, ఎన్‌వీవీయస్ మూర్తి, సంబంధిత శాఖల సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఘనంగా దేవరమ్మ జాతర

కడియం, మార్చి 11: మాధవరాయుడుపాలెంలో అన్నందేవుల వంశ ఇలవేల్పు దేవరమ్మ జాతర సోమవారం ఘనంగా జరిగింది. ఈ జాతర ప్రతి మూడేళ్లకోసారి జరుగుతుంది. సర్పంచ్ అన్నందేవుల చంటి, విజయ దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకకు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న అన్నందేవుల కుటుంబసభ్యులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆత్మీయ విందు చేశారు. కార్యక్రమంలో అన్నందేవుల వీరభద్రరావు(చిన్నారి), అన్నందేవుల నారాయణరావు(పెదబాబు), అన్నందేవుల వీరాస్వామినాయుడు, అన్నందేవుల శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

16న కుసుమ ధర్మన్న జయంత్యుత్సవం



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ పద్మరాజు

దివాన్‌చెరువు, మార్చి 11: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లోని కుసుమ ధర్మన్న కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 16న నన్నయ విశ్వవిద్యాలయంలో మహాకవి కుసుమ ధర్మన్న జయంత్యుత్సవాన్ని నిర్వహిస్తున్నామని ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను వీసీ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన వీసీ మాట్లాడుతూ 16న తెలుగు జాతీయ సదస్సు, కవి సమ్మేళనం, కుసుమ ధర్మన్న సాహితీ పురస్కారాలు అందిస్తారన్నారు. జాతీయ సదస్సులో భాగంగా 30 మంది అధ్యాపకులు, పరిశోధకులు పత్రసమర్పణ చేస్తారని చెప్పారు. ధర్మన్న సాహితీ ప్రస్థానం సామాజిక సేవ అనే అంశంపై 53 మంది కవులు కవితాగానం చేస్తారన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ డి.జ్యోతిర్మయి, కన్వీనర్ తరపట్ల సత్యనారాయణ, తెలుగుశాఖ కోర్సు కోఆర్డినేటర్ కేవీఎన్‌డీ వరప్రసాద్, అధ్యాపకులు తలారి వాసు, డి.లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

కళావేదికల ప్రారంభం

బిక్కవోలు, మార్చి 11: మండలంలో గ్రాసిం ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్మించిన నాలుగు కళావేదికలను సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి గ్రాసిం ప్రతినిధి మురళీకృష్ణతో కలసి ప్రారంభించారు. వీటిలో బలభద్రపురంలో రెండు, ఆర్ఎస్.పేటలో ఒకటి, కాపవరంలో ఒకటి ఉన్నాయి. అలాగే బలభద్రపురంలో గ్రాసిం సంస్థ నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను, కాపవరంలో జలజీవన్ మిషన్‌లో నిర్మించిన తాగునీటి కుళాయిలు, పైప్‌లైన్లను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బుంగా రామారావు, యామన దుర్గాభవాని, సత్యంశెట్టి వెంకటరమణ, వైసీపీ నాయకులు నల్లమిల్లి వెంకటరెడ్డి, రొంగల అప్పాజీ, గువ్వల సత్తిరెడ్డి, యామన దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

39.35 కిలోల గంజాయి స్వాధీనం

నలుగురు నిందితుల అరెస్ట్

రాజానగరం, మార్చి 11: ఒడిషా నుంచి కేరళ రాష్ట్రానికి గంజాయిని తరలిస్తున్న నలుగురు ప్రయాణికులు రాజానగరం పోలీసులకు పట్టుబడ్డారు. లారీలో ప్రయాణిస్తున్న కేరళకు చెందిన నలుగురు వ్యక్తులు లగేజీ బ్యాగుల్లో 39.35 కిలోల గంజాయిని తరలిస్తుండగా మార్గమధ్యలో తూర్పుగోనగూడెం పోలీసు చెక్‌పోస్టు వద్ద పోలీసులకు చిక్కారు. లారీలో ప్రయాణికులు మాదిరిగా బ్యాగుల్లో గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. వారి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, దీని విలువ రూ.2 లక్షలు ఉంటుందని సీఐ పి.కాశీవిశ్వనాథ్ తెలిపారు. ఈ మేరకు నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన

రంగంపేట, మార్చి 11: బాల్యంలో పోషకాహారం ఎంత బాగా లభిస్తుందో మానసిక వికాసం అంత బాగా జరుగుతుందని, పిల్లలకు సరైన పోషణ లభించాలంటే తల్లికి కూడా పూర్తి పోషణ అందించడం తప్పనిసరని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి జెస్సీ ఫ్లోరెన్స్ సూచించారు. పోషణపక్వాడ కార్యక్రమంలో భాగంగా సోమవారం రంగంపేటలో చిరుధాన్యాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా న్యూట్రీ ఎగ్జిబిషన్, గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ శ్రీలక్ష్మీ, సీహెచ్‌వో కె.జయమణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, ఆశాలు, తల్లులు పాల్గొన్నారు.